
PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 263 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 19 సెప్టెంబర్ 2025


## రాగల మూడురోజులు భారీ వర్షాలు




## కాంగ్రెస్ సేవాదళ నియోజకవర్గ అధ్యక్షునిగా తాళ్లపల్లి రాజు




# ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు

**ఇతర రాష్ట్రాల ఫోన్లు ఉపయోగింపు**

**ఒక రాష్ట్రం తరవాత మరో రాష్ట్రం**

**కాంగ్రెస్‌కు పడే ఓట్ల జాబితా గుర్తించి చర్య**

**పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాహుల్ వివరణ**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల మిగతా2లో...

# నేపాల్ శాంతిస్థాపనకు మద్దతు

## నేపాల్ ప్రధాని సుశీలా కార్కీకు మోడీ ఫోన్



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** నేపాల్‌లో శాంతి స్థాపనకు తమ సంపూర్ణమద్దతు ఉంటుందని ప్రధాని మోడీ ప్రకటించారు. ఈ మేరకు ప్రధాని సుశీల కార్కీకు మోడీ సందేశం పంపారు. సోషల్ మీడియాపై మిగతా2లో...

# సిఎంతో బ్రిటిష్ హైకమిషనర్ లిండీ భేటీ

## తెలంగాణ విద్యార్థులకు సహకారం ఇస్తామని హామీ



**హైదరాబాద్,సెప్టెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్ కో-ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు లిండీ కామెరాన్ అంగీకరించారు. ఎడ్యుకేషన్, టెక్నాలజీ సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు- ముఖ్యమంత్రికి బ్రిటిష్ హైకమిషనర్ వివరించారు. యూకే యూనివర్సిటీలలో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి అక్కడి యూనివర్సిటీలు ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న కొత్త ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్ట్‌ను కూడా బ్రిటీష్ హైకమిషనర్‌కు సీఎం వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు ట్రెనింగ్ అందించేందుకు బ్రిటిష్ హైకమిషనర్ సుముఖత వ్యక్తం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటీష్ కంపెనీలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి కోరారు. జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్, అకాడమి విభాగాల్లో పెట్టుబడులకు మిగతా2లో...



# ఎపి లిక్కర్ స్కామ్ కేసులో ఇడి దాడులు

**ఏకకాలంలో 20 చోట్ల పెద్ద ఎత్తున తనిఖీలు**

**సిట్నివేదిక ఆధారంగా రంగంలోకి దగిన ఇడి**

**అమరావతి,సెప్టెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** రూ.3,500 కోట్ల విలువైన ఏపీ లిక్కర్ స్కామ్ అంశంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీలో ఈడీ తనిఖీలు చేపట్టింది. మద్యం మిగతా2లో...

# ప్రభుత్వంపై బతుకమ్మ పాటలతో విమర్శలు

## మూడు పాటలను రాయించిన బిఆర్ఎస్

## పాటలు విడుదల చేసిన కెటిఆర్



**హైదరాబాద్,18(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వాన్ని విమర్శిస్తూ బిఆర్ఎస్ రూపొందించిన బతుకమ్మ పాటల సిడిని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విడుదల చేశారు. అవన్నీ రాజకీయ పాటలే కావడం గమనార్హం. పండగపూట సర్కారును విమర్శిస్తూ ఉయ్యాల అన్న చరణంతో ఈ పాటలను వండి వార్చారు. మార్పు మార్పని వలలో మనలను ముంచింద్రే వలలో.. అంటూ ఓ పాట.. మార్పు మార్పని మనం చేయి గుర్తుకు ఓటేస్తే అంటూ మరో పాట.. ఆరు గ్యారెంటీలు ఉయ్యాలో మిగతా2లో...

# పదిరోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు


## - బిఎసి సమావేశంలో నిర్ణయం



**అమరావతి,సెప్టెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** ఏపీ అసెంబ్లీ సమావేశాలు 10 రోజుల పాటు- నిర్వహించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. . సభలో చర్చించేందుకు 18 అంశాలను తెదేపా ప్రతిపాదించింది. గురువారం మిగతా2లో...

# జూబ్లీహిల్స్‌లో బచ్చాను పెట్టి గెలిపిస్తా...

## కెటిఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్




# ఆన్‌లైన్‌లో ఓట్లను డిలీట్ చేయలేం: కేంద్ర ఎన్నికల సంఘం




**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగినట్లు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఇవాళ కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. ఆ ఆరోపణలు నిరాధారమైనవి, అబద్ధమని ఈసీ పేర్కొన్నది. ఓట్లను ఆన్‌లైన్ డిలీట్ చేయలేరని ఎన్నికల సంఘం చెప్పింది. ఆన్‌లైన్ పద్ధతిలో ప్రజలు ఓట్లను డిలీట్ చేయడం కుదరదని, రాహుల్ గాంధీ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని, బాధిత వ్యక్తి విజ్ఞాపన విన్న తర్వాతనే డిలీట్ ప్రక్రియ జరుగుతుందని ఈసీఐ ఓ ప్రకటనలో పేర్కొన్నది. కర్నాటకలోని అలంద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్లు డిలీట్ అయినట్లు రాహుల్ చేసిన ఆరోపణలపై ఈసీ స్పందిస్తూ.. ఆ నియోజకవర్గంలో జరిగిన అక్రమాలను 2023లో ఈసీనే బయటపెట్టినట్లు పేర్కొన్నది. ఓటర్ల తొలగింపు కోసం ప్రయత్నాలు జరిగాయని, ఈ ఘటన పట్ల ఎన్నికల సంఘం ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు మిగతా2లో...

# దసరా ప్రయాణికులకు శుభవార్త

## 7,754 స్పెషల్ బస్సులను నడపనున్న ఆర్టీసి



**హైదరాబాద్,సెప్టెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** దసరా, బతుకమ్మ పండుగల సీజన్ సమీపిస్తుండటంతో, సొంత గ్రామాలకు వెళ్లే ప్రయాణికుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు సర్వీసులను నడపాలని నిర్ణయించింది. ప్రజల ప్రయాణాన్ని సురక్షితంగా, సౌకర్యవంతంగా మార్చడమే లక్ష్యంగా ఆర్టీసీ ఈ చర్యలు చేపట్టింది. ఈ పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని సులభతరం చేయడానికి, టీ-జీఎస్ఆర్టీసీ సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 2 వరకు ఏకంగా 7,754 స్పెషల్ బస్సులను నడపనుంది. ఈ బస్సులలో, 377 సర్వీసులకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించబడింది. దీంతో ప్రయాణికులు ఇంటి నుంచే తమ మిగతా2లో...

# హైదరాబాద్ బ్రాండ్‌ను కాపాడుకోవాలి

## దిశ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, 18(పీసీడబ్ల్యూ న్యూస్):** నగరంలో నిధుల కొరత ఉన్నప్పటికీ.. లభ్యమవుతున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ, కేంద్ర సహాయ పథకాలు, ప్రాజెక్టుల అమలు స్థితిపై గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ అంటే కేవలం మిగతా2లో...

## నేపాల్ శాంతిస్థాపనకు మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

నిషేధం, అవినీతి వ్యతిరేక నిరసనలతో కొన్ని రోజుల క్రితం అట్టు-డికిన నేపాల్ లో పరిస్థితులు కుదుటపడ్డాయి. ఈ క్రమంలో ఆ దేశంలో శాంతి స్థాపనకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీలా కార్కీ తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన విషయాలను మోదీ ఎక్స్‌లో పంచుకున్నారు. సుశీలా కార్కీతో అద్భుతమైన సంభాషణ జరిగిందని పేర్కొన్నారు. నిరసనల్లో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపం వ్యక్తం చేసినట్లు తెలిపారు. శాంతి, స్థిరత్వం పునరుద్ధరణకు ఆమె చేసే ప్రయత్నాలకు భారత మద్దతును పునరుద్ఘాటించినట్లు- మోదీ వెల్లడించారు. సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై.. అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారిన నేపాల్ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దీంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే సుశీలా కార్కీని తాత్కాలిక ప్రధానిగా జెన్-జీ ఎంపిక చేసింది. గత శుక్రవారం ఆమె ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. కార్కీ సిఫార్సు మేరకు దేశ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ పార్లమెంటు-ను రద్దు చేశారు. 2026 మార్చి 5న ఎన్నికలు నిర్వహించనున్నట్లు- ఆయన ప్రకటించారు.

## పదిరోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో అసెంబ్లీ సమావేశాలు ఈనెల 30వ తేదీ వరకు జరగనున్నాయి. 10 రోజుల పాటు- అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడి అధ్యక్షతన జరిగిన శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ- భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు- మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, విష్ణుకుమార్ రాజు తదితరులు హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై తుది నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్ లు తగ్గించడంతో ధరలు తగ్గడం, ప్రజలకు కలిగిన లాభంపై ఇవాళ్టి సభలో ఆర్థిక మంత్రి కేశవ్ ప్రకటన చేయనున్నారు. ఈ ప్రకటనపై పలువురు ఎమ్మెల్యేలు మాట్లా డనున్నారు. కేంద్రాన్ని అభినందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం ఇవ్వనున్నారు. అలాగే, జలవనరుల శాఖపై నేడు చర్చ జరపనున్నారు. ఈ నెల 22న శాంతి భద్రతలు, 23న వైద్యారోగ్యం, 24న పరిశ్రమలు, 25న సూపర్ సిక్స్ పథకాలు, 26న క్వాంటం, 27న లాజిస్టిక్స్, 29న స్వర్ణాంధ్ర దిశగా ఏపీ, 30వ తేదీన రాయలసీమ- కోస్తా- ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రధానంగా చర్చించనున్నారు. 20, 21, 28 తేదీల్లో అసెంబ్లీకి సెలవులు ఇచ్చారు. ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అసెంబ్లీ సమావేశాలు జరపాలని బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రశ్నోత్తరాలతో పాటు జీరో అవర్ లోనూ సభలో మంత్రులు ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. అసెంబ్లీలో చర్చించేందుకు 9 అంశాలను బీజేపీ ప్రతిపాదించింది.

## సిఎంతో బ్రిటిష్ హైకమిషనర్ లిండీ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ముందుకు రావాలని సీఎం కోరగా.. అందుకు బ్రిటీ-ష్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశానికి డిప్యూటీ- హైకమిషనర్ హైదరాబాద్ గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకానమి అడ్వైజర్ నళిని రఘురామన్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి హాజరయ్యారు. విద్య, సాంతకేతిక సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు- బ్రిటిష్ హైకమిషనర్ సీఎంకు వివరించారు. యూకే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్‌ను కో ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు అంగీకరించారు.

## దసరా ప్రయాణికులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు, తద్వారా కౌంటర్ల వద్ద నిరీక్షణ తప్పించుకోవచ్చు. సెప్టెంబర్ 30 న సద్దుల బతుకమ్మ , దసరా రోజు రోజుల్లో సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య భారీగా ఉండే అవకాశం ఉంది. ఈ రద్దీని తట్టుకోవడానికి ప్రధాన బస్టాండ్ల నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులోకి వస్తాయి. అలాగే, పండుగలు ముగిసిన తర్వాత తిరిగి నగరానికి వచ్చేవారి సౌకర్యార్థం అక్టోబర్ 5, 6 తేదీల్లో కూడా ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ ప్రత్యేక బస్సుల ద్వారా, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. అదనపు ఛార్జీలు లేకుండానే సాధారణ బస్సుల టికెట్ ధరలకే ఈ సేవలు లభ్యం అవుతాయి. దసరా పండుగను ఆనందంగా జరుపుకోవడానికి ఊరెళ్లే ప్రయాణికులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు. మరిన్ని వివరాల కోసం టీ-జీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా సమీపంలోని బస్టాండ్‌లో విచారించవచ్చు.

## రాగల మూడురోజులు భారీ వర్షాలు

● పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

**హైదరాబాద్,సెప్టెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీచేసింది. సూర్యాపేట, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని.. అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. శుక్ర, శనివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలుపడుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది.దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు సగటున సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించిందని ఉందని తెలిపింది. మధ్యప్రదేశ్ మధ్య ప్రాంతాల నుంచి పశ్చిమ-మధ్య ఆనుకొని ఉన్న నైరుతి బంగాళాఖాతం వరకు తూర్పు విదర్భ, తెలంగాణ, దక్షిణ తెలంగాణ, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా సగటు- సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతుందని వాతావరణశాఖ వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట, హైదరాబాద్, పలు పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ముషిరాబాద్ పరిధిలోని భోలక్‌పూర్‌లో 15.5 సెంటీ-మీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.



## ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు దిల్లీలో మీడియా సమావేశంలో ఆరోపణలు చేశారు. ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక పక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు-వేసే కమ్యూనిటీలను మరీ ముఖ్యంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి మేం 100 శాతం ఆధారాలను గుర్తించామన్నారు. త్వరలో ఎన్నికల సంఘంపై హైడ్రోజన్ బాంబ్ పేల్చబోతున్నట్లుగా ప్రకటించినట్టుగానే గురువారం రాహుల్‌గాంధీ పేల్చారు. ఓట్ల చోరీపై గతంలో కొన్ని ఆధారాలు బయటపెట్టగా.. ఈరోజు మరిన్ని ఆధారాలను బయటపెట్టారు. మీడియా ముందు వీడియో ప్రజెంటేషన్ ఇస్తూ... ఓట్ల చోరీపై 100 శాతం ఆధారాలతో రుజువులు బయటపెడుతున్నట్లు-ప్రకటించారు. దేశ వ్యాప్తంగా లక్షలాది ఓట్లు-తొలగించాలని కొంత మంది కంకణం కట్టుకున్నారని.. దానికి ఎన్నికల సంఘం వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే ఈసీ కళ్లప్పగించి చూస్తోందని ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రంలో ఎన్నికలు అయిపోతే.. ఇంకొక రాష్ట్రంలో.. ఇలా అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల సమయానికి లక్షలాది మంది ఓట్లను తొలగిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు.ఒక ఎన్నిక తర్వాత ఒక ఎన్నికలో.. భారతదేశం అంతటా లక్షలాది మంది ఓటర్లను.. వివిధ వర్గాలను, ప్రధానంగా ప్రతిపక్షానికి ఓటు- వేస్తున్న వర్గాలను, తొలగింపు కోసం ఒక సమూహం క్రమపద్ధతిలో లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి మేము 100 శాతం రుజువును కనుగొన్నాము. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. రాజ్యాంగాన్ని ప్రేమిస్తున్నాను.నేను ఆ పక్రియను రక్షిస్తున్నాను. మీరు నిర్ణయించగల 100 శాతం రుజువు ఆధారంగా కాకుండా నేను ఇక్కడ ఏమీ చెప్పబోవడం లేదు. తీర్పు మీదేనని రాహుల్ గాంధీ అన్నారు.ర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో ఎవరో 6,018 ఓట్లను తొలగించడానికి ప్రయత్నించారని.. చివరికి ఎవరో పట్టుబడ్డారన్నారు. ఇది చాలా నేరాల మాదిరిగానే యాధృచ్ఛికంగా పట్టుబడినట్లు- తెలిపారు. ఈ తొలగింపు ప్రయత్నాలు కేవలం కాంగ్రెస్ పార్టీ గెలిచే బూత్‌ల్లోనే జరిగిందని వివరించారు. గోదాబాయి పేరుతో ఎవరో నకిలీ లాగిన్ సృష్టించి 12 మంది ఓటర్ల పేర్లు తొలగించారన్నారు. కానీ ఈ విషయం గోదాబాయికి తెలియదని చెప్పారు. వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ఫోన్ నెంబర్ల ద్వారా ఈ తతాంగం అంతా చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. వారంలోపు ఈసీ డేటా విడుదల చేయాలని.. లేకపోతే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నవారిని రక్షిస్తున్నారని భావించాల్సి ఉంటుందని తెలిపారు. కర్ణాటకలోని అలంద్‌లో ఆరువేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. అలాగే ఓట్ల చోరీకి పాల్పడేవారిని ఎన్నికల సంఘం చీఫ్ రక్షిస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ జరపాలంటూ చేస్తున్న అభ్యర్థనలను విస్మరిస్తున్నారని అన్నారు. ఇది హైడ్రోజన్ బాంబ్ కాదని, దానిని త్వరలో పేలుస్తానని వెల్లడించారు. ఈ విమర్శలను ఎన్నికల సంఘం, భారతీయజనతా పార్టీ ఖండించింది. బాంబ్ తుస్సు అందని భాజపా ఎద్దేవా చేసింది.

## ఎపి లిక్కర్ స్కామ్ కేసులో ఇడి దాడులు

(మొదటి పేజీ తరువాయి)

కుంభకోణం కేసులో నిందితుల సంస్థలు, కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేశారు. 5 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. మరోవైపు ఏపీ మద్యం కుంభకోణం కేసులో సిట్ ఇప్పటివరకూ 29 మంది వ్యక్తులు, 19 సంస్థలను నిందితులుగా చేర్చింది. 12 మందిని అరెస్టు చేసింది. ధనుంజయరెడ్డి (ఏ-31), కృష్ణమోహన్‌రెడ్డి (ఏ-32), బాలాజీ గోవిందప్ప (ఏ-33), పైలా దిలీప్ (ఏ-30)లు బెయిల్‌పై బయటకు రాగా.. చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్‌నాయుడు సహా మొత్తం 8 మంది ఇంకా జైల్లోనే ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఏకకాలంలో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీలలోని 20 ప్రాంతాల్లో దాడులు జరిగాయి. మద్యం కుంభకోణం నిందితుల సంస్థలు, కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేశారు. లిక్కర్ స్కాంలో ఉన్న నిందితుల ఇళ్లలోనూ ఈడీ సోదాలు జరిగాయి. నకిలీ ఇన్వాయిస్‌లు, పెంచిన మద్యం ధరల వెనుక భారీ స్కాం జరిగినట్లు ఈడీ గుర్తించింది. ఈ కేసులో సిట్ ఇప్పటివరకూ 29 మంది వ్యక్తులు, 19 సంస్థలను నిందితులుగా చేర్చి.. 12 మందిని అరెస్టు చేసింది.ఏపీ మద్యం కుంభకోణం మొత్తం విలువ రూ. 3,500 కోట్లుగా ఈడీ అంచనా వేసింది. నకిలీ ఇన్‌వాయిస్‌లు, పెంచిన బిల్లుల ఆధారంగా కిక్ బ్యాక్‌లు చెల్లింపులు జరిగాయని దర్యాప్తులో బయటపడింది. పలు కంపెనీలు, మద్య వ్యాపారాలకు సంబంధించిన కీలక వ్యక్తులు ఈ స్కాంలో ప్రమేయం ఉన్నట్లు- అనుమానం వ్యక్తం చేస్తోంది. ఫ్రంట్ కంపెనీలు ద్వారా డబ్బు లావాదేవీలు జరిగాయని ఈడీకి ఆధారాలు లభించాయి. కిక్ బ్యాక్‌ల కోసం తప్పుడు ఖర్చుల చూపులు, మేనిప్యులేటెడ్ బిల్లులు వాడారని ఆరోపణలు ఉన్నాయి. నిందితుల ఇళ్లు, ఆఫీసులు, గోదాములు, సంబంధిత అకౌంటింగ్ సంస్థల ప్రాంగణాల్లో శోధనలు జరుగుతున్నాయి.ఏపీ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ రిపోర్టులు, ఐటీ- శాఖ సమాచారం ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. కుంభకోణంలో రాజకీయ సంబంధాల కోణాన్ని కూడా పరిశీలిస్తోంది. ఈడీ దాడుల్లో పెద్ద మొత్తంలో డాక్యుమెంట్లు-, డిజిటల్ డేటా, లావాదేవీల రికార్డులు స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. హవాలా మార్గంలో సుమారు వందల కోట్ల సొమ్ము తరలింపులు జరిగాయని అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ దాడులు మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉన్నట్లు- సమాచారం. ఈ కేసుకు సంబంధించిన ఇప్పటికే పలువురు నిందితులు.. ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలు అరెస్ట అయి.. బెయిల్‌పై జైలు నుంచి విడుదలయ్యారు. ఇక ఇదే కేసులో అరెస్ట్ అయి.. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి సైతం బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాంటి వేళ.. ఈ మద్యం కుంభకోణంలో దర్యాప్తు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. ఆ క్రమంలో చెన్నై, హైదరాబాద్, న్యూఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఈడీ అధికారులు గురువారం ముమ్మర దాడులు నిర్వహించారు. దాదాపు 10 బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నట్లు- తెలుస్తోంది.ముఖ్యంగా ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి ఆస్తులపై ఈడీ దృష్టి సారించినట్లు- సమాచారం. మద్యం వ్యవహారంలో పొందిన ముడుపులను షెల్ కంపెనీలకు పంపిన తద్వారా నల్ల ధనాన్ని వైట్‌గా మార్చారంటూ ఇప్పటికే రాజ్ కసిరెడ్డిపై సిట్ నిగ్గు తేల్చింది. ఈ వ్యవహారానికి సంబంధించి.. సిట్ నుంచి ఈడీ సీనియర్ అధికారులు అందుకు సంబంధిందచిన సమగ్ర సమాచారాన్ని మూడు రోజుల క్రితమే తీసుకున్నట్లు- తెలుస్తోంది. మొత్తం 23 సూట్ కేసు కంపెనీలలో జరిగిన లావాదేవీలపై ఈడీ ఈ సందర్భంగా దృష్టి సారించినట్లు- తెలుస్తోంది. అలాగే ఇప్పటి వరకు సిట్ దాఖలు చేసిన చార్జిషీట్‌లోని నిందితుల ఆస్తులు, కంపెనీలపై సైతం ఈడీ దృష్టి సారించింది. అదే విధంగా హైదరాబాద్‌లో సిట్ స్వాధీనం చేసుకున్న రూ. 11 కోట్ల నగదు వివరాలను సైతం ఈడీ అధికారులు అడిగి తెలుసుకున్నట్లు- తెలుస్తోంది. ఈ దాడులు సమయంలో ఎప్పటికప్పుడు సిట్ అధికారులతో సంప్రదిస్తూ.. తమకున్న సందేహాలను ఈడీ అధికారులు నివృత్తి చేసుకుంటున్నారని సమాచారం. తిరుపతి, హైద్రాబాద్‌లోని మరి కొన్ని కంపెనీలపై కూడా ఈ దాడులు చేసేందుకు మరిన్ని బృందాలు ఇప్పటికే ఢిల్లీ నుంచి బయలు దేరినట్లు- తెలుస్తుంది. అందుకోసం ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు తిరుపతిలో పలు బృందాలు ఎదురు చూస్తున్నాయి.

## ప్రభుత్వంపై బతుకమ్మ పాటలతో విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ఆగమే జేసింద్రు ఉయ్యాలో ...అంటూ మరో పాటను ఈ సందర్భంగా కేటీఆర్ ఆవిష్కరించారు. బతుకమ్మ పండుగ అంటే తెలంగాణ ఆత్మ.. ఈ గడ్డకు పరిమితమైన పూల సింగిడి. ఆడబిడ్డల పండుగ.. ఈ పండగపూట పురాణ గాథలు, కథలు, రామాయణ, మహాభారత ఘట్టాలను పాటలుగా పాడుతూ ఉంటారు. తరతరాలుగా వస్తున్న పాటల మాదిరిగా రాజకీయ విమర్శలను చేస్తూ పాటలు రాసి పాడించి మరీ వాటిని ఆవిష్కరించారు. ఈ పాటలు నిజంగా బతుకమ్మ దగ్గర పాడేలాన ఉన్నాయా..? పాడుతారా..? అనేది పక్కన పెడితే బతుకమ్మ లాంటి పండుగను కూడా రాజకీయ వేదికగా వాడుకునేందుకు యత్నిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. మొన్నటి వరకు బతుకమ్మను విశ్వవ్యాప్తం చేసింది కవితమ్మ.. బ్రాండ్ అంబాసిడర్ ఆమెనే అంటూ చెప్పిన వాళ్లు సడెన్‌గా ఇవాళ మాటమార్చేశారు. బతుకమ్మకు బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్ అని పాటల విడుదల సందర్భంగా చెప్పడం గమనార్హం. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బతుకమ్మ ను తెలంగాణ నుంచి వేరు చేసి రేవంత్ రెడ్డి మహిళల హృదయాలను గాయపరిచారన్నారు. ఈ నేల స్వభావం తెలిసిన పాలన మళ్ళీ రావాలని అన్నారు. పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ మూడు పాటలను స్పెషల్‌గా రాయించామని చెప్పుకొచ్చారు. బతుకమ్మ పండుగను గొప్పగా నిర్వహించామని చెప్పారు. కోటి మంది మహిళలను బతుకమ్మ చీరలతో గౌరవించిన నాయకుడు కేసీఆర్ అని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. తన పాలనలో ఆడపడుచులను కన్నతండ్రిలా చూసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత తెలంగాణ తల్లి చేతిలోని బతుకమ్మ మాయం చేశారంటూ విమర్శలు చేశారు. ప్రభుత్వ ఆఫీసుల్లో బతుకమ్మ ఆడుకునే అవకాశం కేసీఆర్ ఇచ్చారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. బతుకమ్మ పండుగ కోసం లంబాడీ ఆడబిడ్డలు ఎదురుచూస్తుంటారని మాజీ ఎంపీ మాలోత్ కవిత చెప్పారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విడుదల చేసిన బతుకమ్మ పాటలన్నీ రాజకీయ పాటలే కావడం విమర్శలకు తావిస్తోంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను తాను పుట్టిన ఊరు చింతమడక ఆహ్వానించింది. ఈ నెల 21న నిర్వహించే ఎంగిలిపూల బతుకమ్మ పండుగకు రావాలంటూ గ్రామస్తులు కవితను ఆహ్వానించారు. కవితను సిద్దిపేట జిల్లా చింతమడక వాసులు ఆహ్వానించడం విశేషం. తెలంగాణ భవన్‌లో రాజకీయ పాటలను బీఆర్ఎస్ విడుదల చేయడం, కవిత చింత మడకలో బతుకమ్మ పండుగకు వెళ్తుండటం హాట్ టాపిక్‌గా మారాయి.

## హైదరాబాద్ బ్రాండ్‌ను కాపాడుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ- మాత్రమే కాదు.. నిజమైన హైదరాబాద్ బస్తీల్లో ఉంది. నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు జలమయమై ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీ-వల వర్షాల కారణంగా నాంపల్లిలో ఇద్దరు, సంతోష్‌నగర్‌లో ఒకరు నాలాలో కొట్టు-కుపోవడం దురదృష్టకరం. ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు- అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేసి.. నగర ప్రాధాన్యతను గుర్తుంచుకొని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవాలని సూచించారు. ఏ బస్తీకి వెళ్లినా వర్షపు నీరు, వరదలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ సిస్టం దెబ్బతిని.. తాగునీటిలో కలిసిపోతోంది. అన్నీ రిస్టోర్ చేసి శుభ్రం చేయాలి. స్కూల్స్, కమ్యూనిటీ- హాళ్లు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించుకోవాలని కిషన్‌రెడ్డి అన్నారు. దిశ సమావేశంలో ఎంపి ఈటెల రాజేందర్ సహా పలువురు నేతలు, కలెక్టర్ హరిచందన తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో ఓట్లను డిలీట్ చేయలేం: కేంద్ర ఎన్నికల సంఘం

(మొదటి పేజీ తరువాయి)

ఈసీ తన స్టేట్మెంట్‌లో తెలిపింది.అలంద్ నియోజకవర్గ సీటును 2018లో బీజేపీ అభ్యర్థి సుబద్ గుత్తేదార్, 2023లో కాంగ్రెస్ అభ్యర్థి బీఆర్ పాటిల్ గెలిచినట్లు ఎన్నికల సంఘం పేర్కొన్నది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను రాహుల్ టార్గెట్ చేయడం దురదృష్ట కరమని ఈసీ వర్గాలు పేర్కొన్నాయి. జ్ఞానేశ్ కుమార్ ఆర్నెళ్ల క్రిత ం సీఈసీగా బాధ్యతలు చేపట్టారని, కానీ ఏడాది క్రితం అక్ర మా లు జరిగినట్లు రాహుల్ ఆరోపించినట్లు ఈసీ వర్గాలు తెలిపాయి.

## జూబ్లీహిల్స్‌లో బచ్చాను పెట్టి గెలిపిస్తా...

### కెటిఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్

**హైదరాబాద్,18(పీసీడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తానని కెటిఆర్‌కు మంత్రి పొంగలేటి సవాల్ విసిరారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఇష్టం వచ్చినట్టుగా కాంగ్రెస్‌పై మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. ఎప్పటికో మూడున్నర సంవత్సరాల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల గురించి కాకుండా త్వరలో వచ్చే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల గురించి కెటిఆర్ ఆలోచించాలని మంత్రి పొంగులేటి ఎద్దేవా చేశారు. మూడున్నర సంవత్సరాల తర్వాత కెటిఆర్ ఇండియాలో ఉంటావా? లేదా ఫారిన్‌లో ఉంటావా? అంటూ మంత్రి పొంగులేటి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఎన్ని సీట్లు- వచ్చాయో స్థానిక ఎన్నికల్లో కూడా ఆ పార్టీకి అన్నే సీట్లు- వస్తాయని పొంగులేటి ఎద్దేవా చేశారు. గురువారం మంత్రి పొంగులేటి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బీసీ సంక్షేమ సంఘం నూతన జిల్లా యూత్, దుగ్గొండి మండల కమిటీల నియామకం

**- రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల రాజు,**

**- జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్**



**నర్సంపేట, సెప్టెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం దుగ్గొండి మండలం గిర్నిబావిలోని జి ఆర్ బి కన్వెన్షన్ హాలులో జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనన్న ఆదేశాల మేరకు మండల ఇంచార్జ్ కడారి సురేష్ యాదవ్ ఏర్పాటు చేసిన సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల రాజు, వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ లు హాజరై నూతన జిల్లా యువజన మరియు దుగ్గొండి మండల కమిటీ, యూత్ కమిటీలను ఎన్నుకున్నారు. బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా యువజన సంఘం జిల్లా అధ్యక్షునిగా కడారి సురేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు ముద్రబోయిన రమేష్ ముదిరాజ్, జిల్లా కార్యదర్శిగా కానుగుల కుమారస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి మట్ట రమేష్ యాదవ్, దుగ్గొండి మండల అధ్యక్షునిగా పొన్నాల మహిపాల్, ఉపాధ్యక్షులుగా చొప్పరి భాస్కర్ ముదిరాజ్, కొత్తపల్లి శివ, కార్యదర్శిగా మోకిడే శ్రీకాంత్, దుగ్గొండి మండల యూత్ కమిటీ అధ్యక్షునిగా బోళ్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా బండారి ఉదయ్ కుమార్లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు డ్యాగం శివాజీ, మోకిడే దేవరాజు, ల్యాగల ప్రవీణ్ సింగర బోయిన నవీన్, ఇజ్జగిరి నరేష్, యార నర్సింహ, పెంతల రమేష్, పొన్నం రాజు లు పాల్గొన్నారు.

---

# రైతులు పండించిన పత్తిని అమ్మటానికి పరిమితులు విధించటం అన్యాయం

**సబ్సిడీని ఎత్తివేసి కుట్రలో భాగమే యూరియా కొరత**

**కౌలు రైతులను గుర్తించడంలో రాష్ట్ర ప్రభుత్వం వివక్షత**

**రైతాంగ సమస్యలపై ఈనెల 25న జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు**

**ఏఐకేఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్**




**నర్సంపేట, సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** రైతులు ఆరుగాలం కష్టించి పత్తిని పండిస్తే అమ్మే సందర్భంలో సాధ్యం కానీ కండిషన్లు పెట్టి పరిమితులు విధించడం అన్యాయమని రైతు పత్తిని భేశరత్తుగా మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వల్లేపు ఉపేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు వస్కుల మట్టయ్య అధ్యక్షతన స్థానిక ఓంకార్ భవన్ లో జరిగింది. ఈ సమావేశంలో ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్, వల్లెపు ఉపేందర్ రెడ్డి లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూరియా పై సబ్సిడీ ఎత్తివేసి కుట్రలో భాగంగానే యూరియా కొరత సృష్టించి రైతులకు తీరని నష్టాన్ని చేకూరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ముందస్తు వ్యవసాయ ప్రణాళిక వేయకుండా యూరియా నిల్వలు చేపట్టకుండా రైతుల నష్టానికి కారణం అయిందన్నారు. మరోవైపు రైతులు అష్ట కష్టాలు పడి పత్తి పంట పండిస్తే పంట చేతికి వచ్చి అమ్ముకునే దశలో సిసిఐ మరియు ప్రభుత్వం కలిసి ఫార్మర్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ అనేక ఆంక్షలు విధించడం విడ్డూరంగా ఉందన్నారు. అసలే ప్రకృతి వైపరీత్యాలు యూరియా కొరతలతో దిగుబడి తగ్గి రైతులు అప్పుల ఆందోళనలో ఉంటే ఇలాంటి ఆంక్షలతో పాటు కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతి పై 11% సుంకాలను ఎత్తివేసి విదేశీ పెట్టుబడిదారులకు ఊడిగం చేయడం దేశీయ రైతులను దివాలా తీయించి వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రలకు పాల్పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 22 లక్షల మంది కౌలు రైతులను గుర్తిస్తామని ప్రభుత్వ పథకాలు వర్తింప చేస్తామని హామీ ఇచ్చి నేటికీ పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా తక్షణమే కౌలు రైతులను గుర్తించి ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళన చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి రాష్ట్ర నాయకులు వి తుకారా నాయక్ ఎండి ఇస్మాయిల్ నాగెల్లి కొమురయ్య సింగతి మల్లికార్జున్ వక్కల కిషన్ మారయ్య అంజన్న తదితరులు పాల్గొన్నారు.

---

# ప్రధాని మోదీ నాయకత్వానికి ప్రపంచ దేశాలు జేజేలు పలుకుతున్నాయి...

**● మోదితో ఏదైనా సాధ్యమే..**

**● విశ్వ గురువుగా దేశాన్ని తీర్చిదిద్దడమే బిజెపి సంకల్పం...**

**● బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...**





**కరీంనగర్ జిల్లా,సెప్టెంబర్18(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రధాని మోదీ ఆలోచనలు నిర్ణయాలు, పాలన విధానాలతో భారతదేశం నేడు తిరుగులేని శక్తిగా అవతరించిందని, మోదీ నాయకత్వానికి ప్రపంచ దేశాలు జేజేలు పలుకుతున్నాయని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. సేవా పక్వాడ ప్రోగ్రాంలో భాగంగా హుజురాబాద్ నియోజకవర్గం లోని ఇల్లందకుంట, వీణవంక మండలాల్లో స్థానిక బిజెపి శ్రేణులు నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో గంగాడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకు చేపట్టిన సేవ పక్వాడ కార్యక్రమాలన్నింటినీ బిజెపి శ్రేణులు విజయవంతం చేయాలన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దే కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. భారతదేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వరుసగా మూడు టర్మ్ లు అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం నిరంతరం ప్రజల, దేశ అభివృద్ధి కోసమే పరితపించి పనిచేసిందన్నారు. అందులో భాగంగానే పేద మధ్యతరగతి ప్రజలకు నిత్యావసర వస్తువులపై పన్నుల భారాన్ని తగ్గించాలని ఉద్దేశంతో గూడ్స్ సర్వీస్ టాక్స్ (జీఎస్టీ)తగ్గింపు ప్రక్రియను చేపట్టిందన్నారు. ఈనెల 22 నుండి జీఎస్టీ పన్నుల భారం తగ్గనుందని, దీంతో ప్రజలకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉందన్నారు. మోడీ ప్రభుత్వం జీఎస్టీ పై సంచల నిర్ణయం తీసుకుందన్నారు. అలాగే అంతర్జాతీయ, దేశీయ వ్యతిరేక శక్తులు మోడీ ప్రభుత్వాన్ని అనేక కుట్రలు కుతంత్రాలతో ఇబ్బంది పెట్టాలని చూసిన నిలదొక్కుకొని పరిపాలన కొనసాగిస్తుందన్నారు. పోరుగునున్న దేశాల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, ప్రపంచంలోని అనేక దేశాలు యుద్ధ వాతావరణం లో ఉన్నాయని, భారతదేశం మాత్రం మోడీ పాలనలో సురక్షితంగా ఉందన్నారు. దేశ ప్రజలంతా మోడీ ప్రభుత్వంపై ఎంతో విశ్వాసంతో ఉన్నారని , ప్రధాని మోదీ నాయకత్వమే దేశానికి రక్ష అనే భావనతో ప్రజలంతా అండగా నిలుస్తున్నారని తెలిపారు. బిజెపి ప్రజల గుండెల్లో ఉందని, భవిష్యత్తు అంతా బిజెపి దేనన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పై అనతి కాలంలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, రేవంత్ రెడ్డి సర్కార్ అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై గుర్రు గా ఉన్నారని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం భయపడుతుందన్నారు. ప్రజలంతా బిజెపి వైపు చూస్తున్నారని, తెలంగాణలో కూడా బిజెపి ప్రభుత్వమే రావాలని బలంగా కోరుకుంటున్నారని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

---

# కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షునిగా తాళ్లపల్లి రాజు





**హనుమకొండ,సెప్టెంబర్18(పీసీడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షునిగా హనుమకొండ నగరంలోని వడ్డేపల్లి ప్రాంతానికి చెందిన తాళ్లపల్లి రాజు ను హనుమకొండ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొచ్చు చందర్ నియమించారు. నియామక పత్రాన్ని పశ్చిమ ఎమ్మెల్యే నారాయణ రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తన నియమకానికి సహకరించిన కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ ,వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , కాంగ్రెస్ సేవాదళ్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ రెడ్డి , హనుమకొండ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు బొచ్చు చందర్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్న అన్నారు.తను రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ తీసుకునే కార్యక్రమంలో పూర్తిస్థాయిలో పాల్గొని కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తానని ఆయన అన్నారు.

# లంబాడ జేఏసీ కన్వీనర్‌గా బాలాజీ ఏకగ్రీవంగా ఎన్నిక



**ఖానాపూరం, సెప్టెంబర్ 18(పీసీడబ్ల్యూ న్యూస్):** చిలకమ్మతండ గ్రామ పంచాయతీ లంబాడా జేఏసీ కన్వీనర్ గా బానోత్ బాలాజీ ఏకగ్రీవం ఎన్నిక జరిగింది. లంబాడ హక్కులకై నా వంతు కృషి చేస్తానని నాకు ఈ అవకాశం ఇచ్చిన పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల లంబడా జేఏసీ నాయకులు, జిల్లా నాయకులు ఉన్నారు. ఈ కమిటీ లోప్రధాన కార్యదర్శి. ధారావత్ గణేష్ప్రచార కార్యదర్శి. ధారావత్ సాయికో కన్వీనర్.మోతీలాల్. లావుడ్య నరేష్ రాజేంద్ర ప్రసాద్ .ఉదయసింగ్ ఆర్గనైజేషన్. లకవత్ వినోద్. గుగులోత్ వీరన్న. కిషన్.ఉదయ్.రాజు. శంకర్.రమేష్. సంతోష్ మున్నా .పవన్,వెంకన్న.వంశీ .శ్రీను .రవి.నాగేష్.రాజు.శేఖర్. జనార్ధన్.మోహన్.పల్తియ శ్రీను. బొడ. నజీర్.రమేష్. భద్రు. విక్రమ్ .రవి తదితరులు పాల్గొన్నారు.

# డంపు యార్డును మరోచోటకు ఏర్పాటు చేయాలి

**● గ్రామపంచాయతీ ట్రాక్టర్ ముందు మహిళల నిరసన**



**రామడుగు, సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామంలో డంపు యార్డు కుక్కలకు ఆవాసంగా నిలిచాయని వాటితో కాలనీలో ఉండే ప్రజలపై దాడులు చేస్తున్నాయని గురువారం గ్రామపంచాయతీ ట్రాక్టర్ ముందు మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా కుక్కలు గ్రామంలో విచ్చలవిధిగా తిరుగుతూ గత కొద్ది రోజుల క్రితం పలువురుపై దాడి చేసి గాయపరిచాయని,అంతేకాకుండా కొన్ని మూగజీవులు కూడా దాడిలో మరణించాయని వాపోయారు.ఇటివిషంపై అధికారులకు తెలిపిన పట్టించుకోవడంలేదని ఈ రకంగా నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపు యార్డును మరొకచోట ఏర్పాటు చేయాలని తెలిపారు.

# అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలి: వద్దిరాజు

**- 48వ డివిజన్లో దుర్గా మాత ఆగమన ఉత్సవాలు**






**ఖమ్మం, సెప్టెంబర్, 18 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):**దుర్గామాత ఆశీస్సులు ఖమ్మం జిల్లా ప్రజలందరిపై ఉండాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆకాంక్షించారు. అమ్మవారి చల్లని చూపుతో జిల్లాలో కరువు కాటకాలు లేకుండా, పాడిపంటలతో సస్యశ్యామలం కావాలని వేడుకున్నారు. గురువారం రాత్రి ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్లో స్థానిక కార్పొరేటర్లు తోట రామారావు, తోట గోవిందమ్మల ఆధ్వర్యంలో నెలకొల్పిన దసరా అమ్మవారి విగ్రహం వద్ద ఆగమన వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ రవిచంద్రను ఆయన అభిమానులు భారీ బాణాసంచా, డప్పుల మోత మధ్య స్వాగతించారు. ఈ సందర్భంగా తోట రామారావు అధ్యక్షతన జరిగిన సభలో రవిచంద్ర మాట్లాడారు. హైదరాబాద్ నగరానికే పరిమితం అయ్యే ఆగమన వేడుకలు ఖమ్మం లో కూడా నిర్వహించడం అభినందనీయం అన్నారు. తొమ్మిది రోజులపాటు ఇక్కడ జరిగే పూజా వేడుకల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం తోట బ్రదర్స్ పుట్టినరోజు వేడుకలను సందర్భంగా కేక్ కట్ చేసి తినిపించారు.**పొంగులేటి వ్యాఖ్యలను ఖండించిన వద్దిరాజు** రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఉద్దేశించి బచ్చాగాడు అని చేసిన వ్యాఖ్యలను ఎంపీ రవిచంద్ర ఖండించారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు పొంగులేటి అదే బచ్చగాడితో స్నేహం చేసిన విషయం మరిచారా..? అని ప్రశ్నించారు. ఆ బచ్చా గాడే 2023 ఎన్నికల్లో హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపించాడనే విషయం గుర్తెరగాలని అని అన్నారు. కేటీఆర్ పై మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలకు భవిష్యత్లో ప్రజలే సమాధానం చెప్తారని ఎంపీ రవిచంద్ర అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మున్నూరు కాపు సంఘం నాయకులు ఆకుల గాంధీ, తోట రమేష్, తోట లక్ష్మణ్ కుమార్ , నగర మైనారిటీ కార్యదర్శి షకీనా తదితరులు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వ సారధ్యమే దేశానికి శ్రీరామరక్ష...



- భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దే సంకల్పం, లక్ష్యంతో మోడీ సర్కార్ పనిచేస్తుంది...
- బిజెపి నేతలు బొంతల కళ్యాణ్ చంద్ర, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, ఎర్రోజు లక్ష్మణ్...





**తిమ్మాపూర్,సెప్టెంబర్18(పీసీడబ్ల్యూ న్యూస్):** భారతదేశానికి మోడీ ప్రభుత్వ సారాధ్యమే శ్రీరామ రక్ష లాంటిదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర, బిజెపి తిమ్మాపూర్ మండలసేవ పక్వాడ అభియాన్ తిమ్మాపూర్ మండల కన్వీనర్, కో కన్వీనర్ కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, ఎర్రోజు లక్ష్మణ్ అన్నారు. సేవా పక్వాడ ప్రోగ్రాంలో భాగంగా గురువారం రోజున అలుగునూరు పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల శ్రీ పంచముఖ, శ్రీ రామ సాయి దేవాలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ మండల బిజెపి నేతలు దేవాలయ ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బొంతల కళ్యాణ్ చంద్ర, కొయ్యడ శ్రీనివాస్, ఎర్రోజు లక్ష్మణ్లు మాట్లాడుతూ సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఇక్కడి దేవాలయ ప్రాంగణాన్ని శుభ్రపరచడం జరిగిందని తెలిపారు. మోడీ ప్రభుత్వం 2014 లోఅధికారంలోకి వచ్చిన తర్వాత స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. ఇట్టి స్వచ్ఛభారత్ ముఖ్య ఉద్దేశం మన చుట్టూ ఉన్న పరిసరాలు చెత్త చెదారం లేకుండా శుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దేశంలో 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. దేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దాలనే సంకల్పం లక్ష్యంతో పరిపాలన కొనసాగిస్తుందని తెలిపారు. మోదీ ప్రభుత్వ సాహసోపిత, చారిత్రక నిర్ణయాలతో భారతదేశ దిశా దశ మారిందని, నేడు దేశం అన్ని రంగాలలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందన్నారు. భారతదేశ నేడు బలమైన ఆర్థిక శక్తిగా అవతరించిందని, ఇది మోదీ నాయకత్వంలోనే సాధ్యమైందన్నారు. దేశ ప్రజలంతా మోడీ ప్రభుత్వంపై ఎంతో విశ్వాసంతో ఉన్నారని, అందుకే వరుసగా మూడు సార్లు మోడీ కి ప్రధానిగా అవకాశం కల్పించారని తెలిపారు. బిజెపి జనం గుండెల్లో ఉందని, ఆ స్థానాన్ని ఎవరు తుడిచి పెట్టలేరన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్ ,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బోనాల మోహన్ ,కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల రవీందర్ యాదవ్, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# సీనియర్ న్యాయ వాది జమాలుద్దీన్‌కు సన్మానం...



**కరీంనగర్ టౌన్,సెప్టెంబర్18(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో సీనియర్ న్యాయవాది ఖాజా జమాలుద్దీన్ అహ్మద్ 100 వ సంవత్సరం లో అడుగు పెట్టిన సందర్భంగా కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు లింగంపల్లి నాగరాజు ఆధ్వర్యంలో శాలువ కప్పి, పూల మాల వేసి ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక ముకరంపుర లో ఉన్న సీనియర్ న్యాయవాది జమాలుద్దీన్ నివాసానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు లింగంపల్లి నాగరాజు తోపాటు సీనియర్ న్యాయ వాదులు పల్లెర్ల గోపాల కృష్ణ, సయ్యద్ చాంద్, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పీవీ రాజ్ కుమార్, నయీం సిద్ధిఖీ, కొత్త ప్రకాశ్, సిరికొండ శ్రీధర్ రావు, సయ్యద్ అజీజ్ లు వెళ్లి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. జమాలుద్దీన్ కరీంనగర్ జిల్లా కోర్టు లో 1947లో న్యాయ వాదీ గా ఎన్రోల్మెంట్ చేసుకొన్నారు. ఎన్నో కేసులు వాదించి కక్షిదారులకు న్యాయం చేశారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుణ్ణి వేడుకొంటున్నామని తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

# ఎంఈఓకు సన్మానం



**రామడుగు సెప్టెంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల విద్యాశాఖ అధికారిగా ఇటీవల రంగనాథ శర్మ పదవీ బాధ్యతలు చేపట్టారు.. కాగా గురువారం రామడుగు మండల కేంద్రంలోని ఎంఆర్సి భవనంలో గుండిగోపాలరావుపేటలోని అక్షర పాఠశాల కరస్పాండెంట్ మినుకుల మునిందర్ ఎంఈఓ రంగనాథ శర్మను కలిసి పూల బొకేను అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

# సుడా అభివృద్ధి పనులు, ఇతర కార్యకలాపాలపై సమీక్ష...

- పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం.
- నగరంలో మిగిలిపోయిన సుందరీకరణ పనులు ఇతర అత్యవసర పనులు చేపట్టాలని నిర్ణయం.
- నూతన లేఅవుట్లకు ప్రతిపాదనలు.
- అన్ని విభాగాలపై సమీక్ష చేసిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,వైస్ చైర్మన్ ప్రఫుల్ దేశాయ్.





**కరీంనగర్,సెప్టెంబర్18(పీసీడబ్ల్యూ న్యూస్):** శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యకలాపాలపై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,సుడా వైస్ ఛైర్మన్,మున్సిపల్ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ సమీక్ష నిర్వహించారు.సుడా కార్యాలయంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.ముఖ్యంగా కరీంనగర్ నియోజకవర్గంతో పాటు చొప్పదండి,మానకొండూర్ నియోజకవర్గాలలో పలు అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు నగరంలో మిగిలిపోయిన పలు కూడళ్ల సుందరీకరణ సుడా పరిధిలో చేపట్టబోయే నూతన లేఅవుట్లు తదితర అంశాలపై చర్చించినట్టు నరేందర్ రెడ్డి తెలిపారు.సుడా కమర్షియల్ బిల్డింగ్ మరియు ఐడీఎస్ఎంటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సుడా పరిధిలో నూతన లేఅవుట్లు ఏర్పాటు చేయాలని అందుకు గతంలో గుర్తించిన ప్రాంతాలపై రెవెన్యూ, ల్యాండ్ సర్వే మరియు సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి నివేదిక తయారు చేసి లేఅవుట్లు చేయాలని నిర్ణయించినట్టు నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.వన్ టౌన్ పోలీస్టేషన్ ఎదురుగా చొక్కారావు ఐల్యాండ్ పక్కన ఉన్న ఐల్యాండ్ సుందరీకరణ చేయాలని నగరలోని ప్రధాన రోడ్లలో గల నాలాల బ్రిడ్జిలపై ఇరువైపులా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో బ్రిడ్జి మాదిరిగా ప్లాంట్స్ తో సుందరీకరణ చేయాలని నిర్ణయించామని నరేందర్ రెడ్డి తెలిపారు.చొప్పదండి నియోజక వర్గంలోని కొక్కేరకుంట కోనాయపల్లి రోడ్డుకు నిధులు కేటాయించడం జరిగిందని ఇంకా పలు అభివృద్ధి పనులు మరియు సుడాకు అభివృద్ధి చార్జీలు కట్టని పెట్రోల్ బంకులకు నోటీసులివ్వాలని కమర్షియల్ గా నడుపుతూ సుడా అభివృద్ధి పన్నులు చెల్లించని ఫామ్ లకు కూడా నోటీసులివ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు నరేందర్ రెడ్డి తెలిపారు.ఈ సమావేశంలో సీపీవో ఆంజనేయులు,ఎస్ఈ రాజ్ కుమార్,ఈఈ రొడ్డ యాదగిరి,డిఈఈ రాజేంద్ర ప్రసాద్, టీపీవో శ్రీధర్ ప్రసాద్,టీపీఎస్ సంధ్య, అజ్మల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ నర్సంపేట డిపో ఆధ్వర్యంలో దివ్యాంగుల విహార యాత్ర




**నర్సంపేట సెప్టెంబర్ 18,(పీసీడబ్ల్యూ న్యూస్):** ఆర్టీసీ నర్సంపేట డిపో టూర్ ప్యాకేజీ లో భాగంగా నర్సంపేట డివిజన్ దివ్యాంగులు మరియు వారి కుటుంబ సభ్యులు మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహా స్వామి దర్శనం, వాజేడు బొగత జలపాతం, మేడారం సమ్మక్క, సారాలమ్మ దర్శనం, లక్నవరం చూసి రాత్రి నర్సంపేట కి చేరుకుంటుంది. ఇంత మంచి సదావకాశం కల్పించి, భోజన సౌకర్యం కూడా కల్పించిన డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీ కి కృతజ్ఞతలు తెలియజేసారు.

# తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఎండి. షేక్ నిసార్ అహ్మద్ నియామకం





**కరీంనగర్,సెప్టెంబర్18(పీసీడబ్ల్యూ న్యూస్):** యునైటెడ్ టీమ్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ షేక్ నిసార్ అహ్మద్ ని, కరీంనగర్ జిల్లాలో తెలంగాణ స్టేట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. షేక్ నిసార్ అహ్మద్ కి ఈ నియామక పత్రాన్ని తెలంగాణ స్టేట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. స్థిత ప్రజ్ఞ అందజేశారు.కరీంనగర్ రెవెన్యూ క్లబ్‌లో జరిగిన సమావేశంలో మహమ్మద్ షేక్ నిసార్ అహ్మద్ కి ఈ కొత్తగా బాధ్యతలను అప్పగించారు. గొనె శివరాంని అధ్యక్షులుగా ఎన్నుకున్నారు ఇట్టి సమావేశాన్ని ఉద్దేశించి స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ, పాత పెన్షన్ పద్ధతి పునరుద్ధరణ కోసం షేక్ నిసార్ అహ్మద్ చేస్తున్న పోరాటాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా వల్ల ప్రభుత్వ ఉద్యోగులకు కలిగే నష్టాలను వివరించారు. అలాగే, కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం, త్వరితగతిన పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.పునరుద్ధరణ వరకు పోరాటం కొనసాగిస్తామని రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ స్పష్టం చేశారు.సమావేశంలో మాట్లాడిన షేక్ నిసార్ అహ్మద్, తమను జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు స్థిత ప్రజ్ఞకి కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ జిల్లాలో ఉద్యోగులను ఏకం చేసి పునరుద్ధరణ కోసం ప్రతి ప్రయత్నం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ సమావేశానికి సిపిఎస్, ఓపిఎస్ ఉద్యోగులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా హాజరైనవారు: జహూర్ ఉద్దీన్ (సూపరింటెండెంట్, మెడికల్ డిపార్ట్మెంట్),డి. రాజు (సూపరింటెండెంట్ పాలిటెక్నిక్),మహమ్మద్ అఖీల్ అహ్మద్ (ఉర్దూ ఆఫీసర్, కరీంనగర్),సయ్యద్ అసద్ (రిటైర్డ్ టిఓ),మసూద్ అలీ (రిటైర్డ్ సూపరింటెండెంట్),రాములు (సీనియర్ అసిస్టెంట్),బషీర్ హుస్సేన్ (సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ డిపార్ట్మెంట్),సుహైల్ హుస్సేన్ (సీనియర్ అసిస్టెంట్,),బి. శ్రీనివాస్ (జూనియర్ అసిస్టెంట్),మహమ్మద్ అక్రం, ఎం. వాణి, జె. సతీష్, ఆయిషా ముమ్తాజ్, ప్రవీణ్, వినయ్, షారుక్ ఖాన్, అతీఖ్ అహ్మద్, అహ్మద్ పాషా, ముజీబ్ అహ్మద్ ఖాన్, జీషాన్, కొండయ్య, శ్రీనివాస్, శ్యామ్, షఫీక్ ఇతరులు పాల్గొన్నారు.






# ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సహకారంతో వికలాంగునికి సహాయక కర్రలు అందచేత

- అందజేసిన బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు

**షాద్ నగర్,సెప్టెంబర్ 18,(పీసీడబ్ల్యూ న్యూస్):** ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కందివనం పర్యటనలో భాగంగా వికలాంగుడు శ్రీనివాసులు తనకు నడవడానికి చేతి కర్రలు లేవని,ఎటు వెళ్లలేకపోతున్నానని చేతి కర్రలకు కాస్త ఆర్థిక సాయం చేయాల్సిందిగా కోరగా స్పందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి శ్రీనివాసులుకు అవసరమైన చేతికర్రలను అందిందిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు మామిడిపల్లి ఎంపిటిసి కాట్న రవీందర్,పాపిరెడ్డి గూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,పోమాల్ పల్లి మాజీ సర్పంచ్ భూపాల్ రెడ్డి,కాకునూరు మాజీ సర్పంచ్ యారం శేఖర్ రెడ్డి, నాగిళ్ళ వెంకటేష్ చేతుల మీదుగా వికలాంగుడు శ్రీనివాసులు కి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో కందివనం మాజీ వార్డ్ మెంబర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్టిసి డిపో మేనేజర్ వీడ్కోలు

**మహబూబాబాద్, సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** డిపో మేనేజర్ శ్రీ ఎం శివప్రసాద్ బదిలీపై ఖమ్మం డిపోకు వెళుతున్నందున సందర్భంగా మహబూబాబాద్ డిపో ఉద్యోగస్తులు మరియు రిటైర్డ్ ఉద్యోగస్తులు గురువారం డిపో కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలకడం జరిగింది. ఈ సందర్భంగా శివరాం ప్రసాద్ మాట్లాడుతూ... ఉద్యోగస్తులు మరియు డ్రైవర్లు కండక్టర్లు నాకు సహకరించడం వల్లనే నేను ఇంత అత్యుత్తమ సేవలు మహబూబాబాద్ జిల్లా ప్రజలకు అందించగలిగాను అని అన్నారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డిపో ఆఫీస్ సిబ్బంది, ఏడీసీలు , గ్యారేజ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది మరియు వెల్ఫేర్ బోర్డు కమిటీ మెంబర్లు మరియు ఉద్యోగస్తులు పాల్గొన్నారు.



# ఖమ్మంలో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



**ఖమ్మం, సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఖమ్మం నగరంలోని దానవాయిగూడెంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు . తోలుతూ స్వామి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి విశ్వకర్మ నూతన జెండా ఆవిష్కరణ చేయుట జరిగినది . ఈ కార్యక్రమానికి 59వ డివిజన్ కార్పొరేటర్ బట్టుపోతుల లలిత రాణి మరియు అన్ని రాజకీయ పార్టీ నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు . విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాత ్ర సంఘం వారు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారికి గుడి కట్టుటకు స్థలము అడగటం జరిగింది . వారు వెంటనే స్పందించి తప్పకుండా సహాయం చేస్తానని మాట ఇచ్చారు అనీ పేర్కొన్నారు . రాజకీయ పార్టీ నాయకులు కూడా ఎల్లవేళల మీకు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారని తెలిపారు . ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాత ్ర సంఘం అధ్యక్షుడు తాటికొండ వెంకటాచారి , ఉపాధ్యక్షులు అనుమల సోమేశ్వర చారి , ప్రధాన కార్యదర్శి ముమ్మిడి రాజయ్య , కోశాధికారి జుజ్జూరు వెంకటేశ్వరరావు , ఆర్గనైజింగ్ సెక్రటరీ వోలోజు రామాచారి , తాడోజు వెంకటాచారి , కన్నె కంటి అమరేంద్ర చారి , కందుకూరి విక్రమ్ , ఎర్రోజు వెంకటాచారి , అనుముల జనార్ధన చారి , సుంకర శ్రీనివాసాచారి , చిట్టోజు రామబ్రహ్మాచారి , అబ్బోజు నాగార్జున , రామడుగు మహేష్ , తునికి పాటి ఈశ్వర చారి , చింతోజు నవీన్ మరియు రాష్ట్ర జిల్లా నగర నాయకులు పాల్గొన్నారు .




## ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వ అధికారులను, గిరిజన సంఘాలను తప్పు తోవ పట్టిస్తూ నాన్ ట్రైబల్ భూములు కబ్జా ప్రయత్నం ఆదుకోండి



**ములుగు జిల్లా ,సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మండలం ఏటూరు నాగారం గ్రామం శివాపూర్ గత కొంత కాలం నుంచి మా శివాపురం గ్రామానికి చెందిన వట్టం జనార్ధన్ పూణెం నాగేశ్వరరావు ఎస్టి కోయ వీళ్ళిద్దరూ కలిసి నాన్ ట్రైబల్ కి సంబంధించిన 7 కుటుంబాల భూముల మీద దాడి చేస్తున్నారు వీళ్లకు వేరే కాడ పట్టాలు తీసుకొచ్చి నాన్ ట్రైబల్ భూముల మీద చూపించుకుంటూ వీళ్లను నానా రకాలుగా అన్యాయం చేస్తున్నారు గత 30 సంవత్సరాల కాలం నుంచి అట్టి భూములలో వ్యవసాయం చేస్తూ కాస్తూ లో ఉంటూ తాతలు తండ్రులు నాన్ ట్రైబల్ లు కాస్తు కబ్జాకాలంలో ఉన్నారు కానీ ఏదో విధంగా కేసులు పెట్టుకుంటూ పోలీస్ డిపార్ట్మెంట్‌ను రెవెన్యూ డిపార్ట్మెంటును ప్రభుత్వాన్ని మరియు గిరిజన సంఘాలను , మిస్ గైడ్ చేస్తున్నారు గిరిజన సంఘాలపై మాకు పూర్తి విశ్వాసం ఉంది.వీళ్లను నానా రకాలుగా ఇబ్బంది పెడుతున్నారు ఏడు కుటుంబాల భూములును కబ్జా చేయాలని ఇద్దరూ కంకణం కట్టుకున్నారు ఈ సమస్యను ప్రభుత్వం గుర్తించి, గిరిజన సంఘాలు గుర్తించి తగు న్యాయం చేయగలరని నాన్ ట్రైబల్ బిడ్డలు చేతులు జోడించి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. శివాపూర్ నాన్ ట్రైబల్ బాధ్యతలు 1)వంగపండ్ల రవి 2) బండి మల్లేష్ 3)నక్కల రాజు 4)బండి రాజు 5 ఉడుత కొమరయ్య 6)సాదం కుమార్ 7)కన్నబోయిన సాంబరాజు

## 69వ SGFI జోనల్ లెవల్ చెస్ టోర్నమెంట్ కార్యక్రమం

**పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, MDR ఫౌండేషన్ కో-ఫౌండర్ మాదిరి ప్రిథ్వీరాజ్**











**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణ పరిధిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన 69వ SGFI జోనల్ లెవల్ చెస్ టోర్నమెంట్ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఎమ్ డి ఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాదిరి ప్రిథ్వీరాజ్ పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చినటువంటి విద్యార్థులను పృథ్వీరాజ్ అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ప్రిథ్వీరాజ్ విద్యార్థి జీవితంలో విద్య ఎంత ముఖ్యమో,క్రీడలు కూడా అంతే ముఖ్యమైనవి.ముఖ్యంగా చెస్ వంటి ఆలోచన క్రీడలు ఆలోచనా శక్తిని, క్రమశిక్షణను,సామర్థ్యాన్ని పెంచుతాయి. ఈ వేదిక ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించే క్రీడాకారులు మరింత ముందుకు రావాలని ఆశిస్తున్నాను" అని తెలిపారు. అనంతరం పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తూ, వారికి పూర్తి స్థాయి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఎం.ఈ.ఓ నాగేశ్వరరావు కళాశాల ప్రిన్సిపల్, టీచర్లు, వివిధ కాలేజీల పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలి

- పెండింగ్ వేతనాలు చెల్లించాలి
- జీవో నెంబర్ 64ను ఎత్తివేయాలి






**ములుగు జిల్లా ,సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిన్న ములుగులో బస్సు ప్రమాదంలో మరణించిన గగులోతు శ్రీను కు నిరవధిక సమ్మె సందర్భంగా తన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఏడవ రోజు నిరవధిక సమ్మె సందర్భంగా వర్కర్లు కళ్ళకు నల్ల రిబ్బన్స్ తో కంతలు కట్టుకొని నిరసన తెలియజేశారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎండి దావూద్.( ఉపాధ్యక్షుడు మడే రవి సంఘీభావం) తెలియజేశారు అనంతరం దావూద్.రవిలు మాట్లాడుతూ 2014లో తీసుకొచ్చిన జీవో 212 జీవో ప్రకారం ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన వారికి పర్మినెంట్ చేయాలని జీవోను అమలు చేయకుండా కొత్తగా గత ప్రభుత్వం తీసుకొచ్చి జీవో నెంబర్ 64 ను అమలు చేస్తానంటే నెల జీతంలో జీవో 64 ప్రకారం సగం జీతం తగ్గే అవకాశాలు ఉన్నాయని టైం స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని. జీవో ప్రకారం పర్మినెంట్ చేయాలని ఒకవైపు వర్కర్లు గగ్గోలు పెడతా ఉంటే ఉన్న జీతంలో తగ్గించాలని చూడడం దుర్మార్గం అన్నారు. నల్లగొండలో 20 మంది వర్కర్లకు టైమ్ స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారని అదేవిధంగా ఇక్కడ కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే పాత పద్ధతి కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో 64 ను మన ఐటీడీఏ పరిధిలో అమలు చేయడం లేదు కదా అని కొంతమంది అధికారులు అనధికారికంగా అనడంలో ఆంతర్యం ఏమిటని ఒకవేళ జీవో 64 ను అమలుపరచనట్లయితే నిధులు ఉన్నప్పటికీ ఆరు నెలల పెండింగ్ వేతనాలు ఎందుకు ఇవ్వట్లేదని ఆశ్చర్యపోయారు.నిన్న జరిగిపోయిన శ్రీను కుటుంబంలో ఒకరిని తీసుకోవాలని అదేవిధంగా గత ఐదు ఆరు సంవత్సరా లుగా మరణించిన కుటుంబ సభ్యులను పనిలో తీసుకొని వారికి ఎన్ని సంవత్సరాలుగా ఒక్క పైసా కూడా ఇవ్వకుండా వెట్టి చేయించుకుంటున్నారని కావున ఫైరవీలతోటి. లంచాలతో కొత్త కొత్త పేర్లు నమోదు చేసుకొని అసలు వాళ్ళకి అన్యాయం చేస్తున్నారని వెంటనే వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా 10 లక్షల రూపాయ లు ఇవ్వాలని. జీతంతో కూడిన వారాంతపు సెలవులు ఇవ్వాలని. రెండు జతల బట్టలు యూనిఫామ్. గుర్తింపు కార్డులు. వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వర్కర్స్ నాయకులు ఎం నాగలక్ష్మి జి విజయ లక్ష్మి కమల జయలక్ష్మి నాగమణి సరోజన సారబాబు లతోపాటు సుమారు 140 మంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



**సీరోల్ సెప్టెంబర్ 18(పి.సి.డబ్ల్యూ న్యూస్):** పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సీరోలు మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలోని బాలుర, బాలికల వసతి గృహాలను ,విద్యార్థులకు సంబందించిన స్టడీ మెటీరియల్ ను, చుట్టూ పరిసరాలు పరిశీలించారు. చుట్టుప్రక్కల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. కిచెన్, నిలువ చేసిన ఆహార పదార్థాలు, పండ్లు, కూరగాయలు, బియ్యం, త్రాగు నీరు, తదితర వాటిని తనిఖీ చేసారు. వంట గదిని పరిశీలించి, వంట మనుషులు అనుభవం, భోజన మెనూ వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు శుచి, శుభ్రతలతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల సంఖ్య, హాజరును పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్ ను తనిఖీ చేసి విద్యార్థుల్లో పాఠశాల స్థాయిలోనే కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అందుకోసం ఉపాధ్యాయులు విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై పట్టు సాదించేలా కంప్యూటర్ విద్యనూ బోధించాలని అన్నారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల జీవిత ఆశయ వివరాలు అడిగి తెలుసు కున్నారు. పాఠ్యాంశాలలోని వివిధ అంశాలపై కలెక్టర్ అడిగిన పలు ప్రశ్నలకు విద్యార్థులు సరైన సమాధానం చెప్పడంతో విద్యార్థులను అభినందించారు. చదువులో వెనకబడిన విద్యార్థుల కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు, మెరుగైన విద్యాప్రమాణాలు అందించేందుకు తీసు కుంటున్న, తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడుతాయని అందుకోసం పాఠశాల ప్రాంగణంలో అనువైన స్థలాలను గుర్తించి చదును చేసి వాడుకలోకి తీసుకురావాలని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యం పెట్టుకొని, లక్ష్య సాధనకు శ్రమించాలన్నారు. విద్యతోనే సమాజంలో గౌరవమని, విద్యతోనే ఉన్నత స్థానం లభిస్తుందని అన్నారు. ఈ తనిఖీ లో కలెక్టర్ వెంట సీరోల్ ప్రత్యేక అధికారి, తహసిల్దార్ పున్నంచందర్, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ సంతోష్ సోని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారి, ఆర్.ఐ లు సుమతి, శ్రావణి, గ్రామ పాలన అధికారి వీరస్వామి ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# అత్యంత వైభవంగా పద్మాక్షి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- ఈనెల 22 నుండి అక్టోబర్ 4 వరకు పద్మాక్షి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు
- పద్మాక్షి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ
- ఆలయ వేదపండితులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని
- భక్తులకు అన్ని సౌకర్యాలు



**హన్మకొండ సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈనెల 22 నుండి అక్టోబర్ 4వ వరకు హన్మకొండలోని శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో పద్మాక్షి దేవి శరన్నవరాత్రి మహోత్స వాలు నిర్వహిస్తున్నామని ఆలయ వేదపండితులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. గురువారం హన్మకొండ బాలసముద్రం లోని గ్రేటర్ ప్రెస్ క్లబ్ లోబ్ శ్రీ హనుమద్గిరి పద్మాక్షి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆలయ ఆలయ వేదపండితులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి కరపత్రం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో ఏకశిల నగరంలో చెప్పుకునే శ్రీ హనుమద్గిరి యందు సుమారు 2వేల సంవత్సరాల సుప్రసిద్ధ చరిత్ర కలిగిన శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవిగా స్వయంభుగా స్థిరనివాసం ఏర్పరచుకున్నదని అన్నారు. దేవాలయంలో సుమారు 500 సంవత్సరాల నుండి వంశపారపర్యంగా నాగిల్ల వారు అవి చిన్నముగా భక్తుల సహకారంతో దసరా ఉత్సవాలు నిర్వహించబడుతున్నాయని ఈ సంవత్సరం కూడా ఈ నెల 22వ తేదీ నుండి అక్టోబర్ 4వ తేదీ వరకు అత్యంత వైభవంగా శ్రీ హనుమద్గిరి పద్మాక్షి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.పద్మాక్షి దేవాలయం కొండపైన ఉన్నందున ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాలా ఏర్పాటు చేశామని, గుట్టపైకి కూడా రోడ్డు సౌకర్యం ఏర్పాటు చెయడం జరిగింది. భక్తుల సౌకర్యార్థం మంచినీటి వసతి, పార్కింగ్ ఏర్పాట్లు, విద్యుత్తు దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ నిమజ్జనోత్సవం, తిప్పోత్సవం కార్యక్రమాలను నిర్వహించబడునని పేర్కొ న్నారు. ప్రతిరోజు అమ్మవారిని అభిషేకం తో పాటు ప్రత్యేక అలంకరణ, పూజలు, చండీ హవనం ప్రతిరోజు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి సేవలో పాల్గొన్నాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేదపండితులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని, కనుకుంట్ల రవికుమార్, నీలారపు రాజకుమార్, పోలు లక్ష్మణ్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై కేసు నమోదును ముక్తకంఠంతో ఖండించిన అఖిలపక్షం



**టీ న్యూస్ సాంబశివరావు సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌పై కేసులు ఉపసంహరించుకోవాలి**

**మీడియాపై అణచివేత ధోరణి మానుకోవాలి**

**: సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు**

**మీడియాకు స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారు: సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు హేమంతరావు**

**అక్రమ కేసులు అనేవి మంచిది కాదు: పువ్వల దుర్గా ప్రసాద్ కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు**

**కేసు ఉపసంహరించుకునే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదు: టియుడబ్ల్యూజే టి జె ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ**

**టియుడబ్ల్యూ జెటిజెఎఫ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు ఉద్ఘటన**





**ఖమ్మం సెప్టెంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** యూరియా కొరతతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యను కవరేజ్ కోసం వెళ్ళిన ఖమ్మం జిల్లా టీ న్యూస్ బ్యూరో సాంబశివరావు,సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి లపై కేసు నమోదు చేయడాన్ని అఖిలపక్ష పార్టీలు ముక్తకంఠంతో ఖండించాయి. తక్షణమే టీ న్యూస్ బృందంపై సాక్షి ఎడిటర్ పై కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో టియుడబ్ల్యూజే టీజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులపై అక్రమ కేసుల అంశంపై టీజిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి సమన్వయకర్తగా రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, సిపిఐ, కాంగ్రెస్, సిపిఎం, బి ఆర్ ఎస్, టీయూడబ్ల్యూజే ఐ సి యు , న్యూడెమోక్రసీ ఇతర ప్రజా సంఘాలను నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లేందుకు వార్త కవరేజ్ కి వెళ్లిన వారి జర్నలిస్టులపై ప్రభుత్వం నిర్బంధాలు కొనసాగించడం తగదన్నారు. టీవీ ఛానల్ ను పత్రికలను భజన మీడియా గా మార్చుకున్నందుకు పాలకవర్గం ఇలాంటి నిర్బంధాలు ప్రయోగిస్తుందని విమర్శలు చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక జర్నలిస్టులపై రచయితలపై దాడులు మరింత పెరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యను వాస్తవమైన విషయాన్ని వార్తా కథనాలుగా రాస్తే తప్పేంటి అని వారు ప్రశ్నించారు? పాలకవర్గాలు మారిన జర్నలిస్టులపై నిర్బంధాలు యధావిధిగా కొనసాగుతున్నాయని భవిష్యత్తులో జర్నలిస్టులపై కేసు నమోదు చేయాలంటే భయపడేలా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సాంబ, నాగరాజు రాజేష్, సాక్షి ఎడిటర్ ధనుంజయ్ లపై కేసులు ఉపసంహరించుకోకపోతే మరోసారి ప్రత్యక్ష ఆందోళనకు నిర్వహించాలని తీర్మానించారు. **మీడియాపై అణచివేత ధోరణి మానుకోవాలి: సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పి రంగారావు** స్వతంత్రంగా ఎదగాలనే మీడియా ఆలోచన నిర్బంధల ద్వారా లోపర్చుకోవాలని ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని రాష్ట్ర కార్యదర్శి పి .రంగారావు అన్నారు



యూరియా వార్తలను వాస్తవమైన విషయాలను కవరేజ్ చేసినందుకు రాజ్య ద్రోహం కేసు నమోదు చేయడం అన్యాయమన్నారు. బిజెపి పాలిత ప్రాంతాలలో జర్నలిస్టులపై దాడులు మరింత పెరిగాయని ప్రస్తుతం కాంగ్రెస్ కూడా అదే అదే ధోరణితో వ్యవహరిస్తుందని అన్నారు. కేసును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. **మీడియాకు స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారు: సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు బి హేమంతరావు** గత ప్రభుత్వం హయంలో కొనసాగిన నిర్బంధాలే కాంగ్రెస్ హయాంలో కూడా కొనసాగుతున్నాయని సిపిఐ జాతీయ నేత భాగం హేమంత్ రావు అన్నారు. మాకు వ్యతిరేకంగా వార్తలు రాస్తే కేసులు నమోదు చేస్తామని బెదిరించడం సరికాదన్నారు.బిజెపి పాలిత ప్రాంతంలో దాడులు ఎక్కువయ్యాయని, తెలంగాణలో యూరియా సమస్యను రాసిన నేతలపై రాజ ద్రోహం కేసులు పెట్టడం ప్రజాస్వామ్యం కాదన్నారు. **అక్రమ కేసులు మంచి సంప్రదాయం కాదు: పువ్వల దుర్గా ప్రసాద్ కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు** జర్నలిస్టులపై మా ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడదని, ఒకవేళ అక్రమ కేసులు బనాయిస్తే అది మంచి సంప్రదాయం కాదని డిసిసి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పి.దుర్గ ప్రసాద్ అన్నారు. గోపవరం లో యూరియా సమస్యను ప్రభుత్వానికి వ్యతిరేకంగా చెప్పాలని అత్యుత్సాహం తో రైతులను రెచ్చగొట్టినట్టు మా దృష్టికి వచ్చిందని రైతు స్వ హస్తాలతో రాసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టేషన్లో కేసు నమోదు అయిన విషయం తెలిసిందని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న అధికార పార్టీలో ఉన్న జర్నలిస్టుల పక్షానే తమ పార్టీ ఉంటుందని పేర్కొన్నారు. **జర్నలిస్టుల పై వెంటనే కేసు నమోదు చేసే పద్ధతి మానుకోవాలి: రామ్ నారాయణ ఐ జె యు రాష్ట్ర కార్యదర్శి** జర్నలిస్టులు అనగానే వెంటనే కేసు నమోదు చేసి చర్యలు మానుకోవాలని ఐ జె యు రాష్ట్ర కార్యదర్శి రామ్ నారాయణ అన్నారు. జర్నలిస్టులపై కేసు కుటుంబం మీదనే ప్రభావం ఉంటుందని,కానీ దాని ప్రభావం అధికార పార్టీకి అధికారులకు భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. యూరియా కోసం మంత్రీ తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న కృషిని స్వాగతిస్తున్నాను అని అదే సందర్భంలో కేసులు నమోదు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. **యూరియా కొరత అంశాన్ని కప్పిపుచ్చుకునేందుకే కేసులు: బి ఆర్ ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు** సకాలంలో రైతులకు యూరియా అందించే విషయంలో తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలం అయిందని వాస్తవమైన విషయాలను ప్రసారం చేస్తే తప్పేంటి అని ప్రశ్నించారు? ప్రజలకు వాస్తవాలు తెలియకుండా అడ్డుకునేందుకే మీడియా ప్రతినిధులపై కక్ష సాధింపు కేసులో నమోదు చేసిందని ఆరోపించారు. **100శాతం కుట్రపూరితమైన కేసు నమోదు చేశారు: అడ్వకేట్ జెఎసి చైర్మన్ తిరుమల రావు** రాజ్యాంగంలో ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడుతున్న జర్నలిస్టుపై 100 శాతం కుట్రపూరిత మైన కేసు నమోదు చేశారని అడ్వకేట్ చేసి చైర్మన్ తిరుమల రావు అన్నారు. గవర్నర్ ,దేశ ప్రధానిలపై దాడి చేస్తే నమోదు చేసే సెక్షన్స్ పెట్టి చట్ట విరుద్ధంగా నిర్బంధించే కుట్ర ప్రభుత్వం వైపు నుంచి జరిగిందని తక్షణమే కేసు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. **దుర్మార్గమైన చర్య.. అధికారంలో కి రాగానే మారిపోతారా? :సి పి ఎం కళ్యాణ వెంకటేశ్వరరావు** యూరియా సమస్య కవరేజ్ కి వెళ్ళిన జర్నలిస్టులు పై కేసు నమోదు చేయడం దుర్మార్గమైన చర్యని సిపిఎం నాయకులు కళ్యాణ వెంకటేశ్వరరావు అన్నారు. ప్రతిపక్షం నుండి అధికారంలోకి రాగానే జర్నలిస్ట్ ను నిర్బంధిస్తారా? అని ప్రశ్నించారు. సిపిఎం సిఐటియు నిరంతరం జర్నలిస్టుల పక్షాన ఉంటుందని తెలిపారు**ఉన్నది ఉన్నట్లు రాస్తే ఉలుకెందుకు ? వృత్తిపరమైన ఆటంకాలు సృష్టిస్తే ఊరుకునేది లేదు : ఐ జె యు రాష్ట్ర నాయకులు మాటేటి వేణుగోపాల్ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు** ప్రభుత్వ వైఫల్యాలను ఉన్నది ఉన్నట్లుగా ప్రజలకు వివరిస్తుంటే ప్రభుత్వం ఎందుకు ఉలిక్కిపడుతుందని ఐజెయు నేతల ప్రశ్నించారు? బాధ్యత కలిగిన జర్నలిస్టులకు వృత్తిపరమైన అడ్డంకులు సృష్టిస్తే సహించేది లేదని తిరుగుబాటు ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు. జర్నలిస్టుకు ఎక్కడ అన్యాయం జరిగిన తుది పోరుకు ఐజె యు సిద్ధంగా ఉంటుందని వారు తెలిపారు. **జర్నలిస్టుల రక్షణ చట్టం తేవాలి: కనకం సైదులు చైర్మన్ స్థంబాద్రి** మ్యూచివల్ కో - ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వాస్తవమైన విషయాలు టెలికాస్ట్ చేస్తే ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడానికి తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు పోలీసులు ఇతర రాజకీయ నాయకులు స్నేహపూరితంగా వ్యవహరిస్తూ దాడులు కేసులు పెడుతున్నారని. తక్షణమే జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. **ఏకపక్ష నిర్ణయాలతో ప్రభుత్వానికి నష్టం:బొల్లం శ్రీనివాస్ కార్యదర్శి** వార్త కవరేజీ విషయంలో ఏకపక్షంగా ఆలోచిస్తూ జర్నలిస్టులపై కేసులను నమోదు చేయడం సరైనది కాదని దీని పర్యావసనాలు రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుందని శ్రీనివాస్ హెచ్చరించారు.అధికార అహంకారంతో జర్నలిస్టులపై కేసుల నమోదు చేస్తే తిరుగుబాటు బలంగా ఉండేలా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు మోహన్ రావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జితేందర్ రెడ్డి, క్లైయిమెంట్ తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకుల నరేందర్, పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి వెంకటేష్ జర్నలిస్టులకు మద్దతుగా మాట్లాడారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వారిలో టీ జె ఎఫ్ టెంజు జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీ కాంత్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, ఐ జె యు రాష్ట్ర నాయకులు మురారి ఎలెక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు మామిడాల భూపాల్, కార్యదర్శి మహేందర్, ఐ జె యు నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్, నామా పురుషోత్తం,టి జె ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దుంపటి భాస్కర్, మందుల ఉపేందర్,ఆర్ టీవీ ఉదయ్, 6టివి హరీష్, శ్రీధర్ శర్మ, చక్రవర్తి, అమరవరపు కోటేశ్వర రావు, రామిశెట్టి విజేత , ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, టెంజు నగర అధ్యక్షులు యాలమందల జగదీష్, కార్యదర్శి అశోక్ ఉపాధ్యక్షులు సాయి, కిరణ్, కల్యాణ్, సాయి, , కొమ్ము ఉపేందర్, జీవన్ రెడ్డి వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు సుధాకర్, రంగా నాగేశ్వర రావు, బాబు,సతీష్, పృథ్వీ, శంకర్,ఫోటో గ్రాఫర్ యూనియన్ నాయకులు రాజు, మహేశ్, స్టార్ శ్రీను, రవి శంకర్ టి జె ఎఫ్ నాయకులు ముత్యాల కోటేశ్వరరావు అంతోటి శ్రీనివాస్,నరేందర్, మోదుగు శ్రీధర్, నల్లమోతు శ్రీనివాస్, ఇస్సాంపల్లి వెంకటేశ్వర్లు, కూరపాటి నరేష్, ఈశ్వరి, తోట గణేష్,బి శేఖర్ పాల్గొన్నారు

---

# వార్షిక తనిఖీలలో భాగంగా పుల్కల్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**పోలీసు స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, రికార్డ్స్ మెంటేనేన్స్,సిబ్బంది కిట్ ఆర్టికల్స్ పరిశీలన**

**స్టేషన్ అధికారి,సిబ్బంది పని తీరు బాగుంది**

**జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్**





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం నాడు సంగారెడ్డి జిల్లా ఆందోళ్ నియోజకవర్గం పుల్కల్ పోలీసు స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్, ఈ సందర్భంగా పుల్కల్ పోలీసు గౌరవ వందనం స్వీకరించి,డిఎస్పీతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు.. అనంతరం స్టేషన్ పరిసరాల శు భ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల మెంటేనేన్స్ ను పరిశీలించారు.సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేస్తూ.. కిట్ ఆర్టికల్స్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనం చేసుకున్న/ కేసులో ఉన్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను తనఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేయాలని,ఆస్థి సంబంధిత నేరాలకు సంబంధించి, అధిక నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పార్ట్స్ లు గా గుర్తించి, పగలు, రాత్రి బీట్ డ్యూటీల ద్వారా నిఘా కట్టుదిట్టం చేయాలని సూచించారు. రిసీప్షన్ సిబ్బంది స్టేషన్ కు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్లైన్ లో నమోదు చేయాలని, ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలని అన్నారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన విలేజ్ పై పూర్తి అవగాహన ఉండాలని, గ్రామ పెద్దలతో యువతతో సత్:సంబంధాలను కలిగి ఉండాలని అన్నారు. స్టేషన్ పరిదిలో గల రౌడీ, సస్పెక్ట్ హిస్టరీ షీటర్లను చెక్ చేస్తూ ఆన్లైన్ రికార్డు లో నమోదు చేయాలన్నారు. అనుమానిత వ్యక్తులను పాపిలోన్ డివైస్ ను వినియోగించి, వేలిముద్రాలను చెక్ చేస్తూ.. పాత నేరస్తులను గుర్తించాలని అన్నారు. నేరాల అదుపులో, జరిగిన నేరాలను ఛేదించడంలో ఉపయోగపడే సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ.. ప్రజలే స్వచ్ఛందంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు.స్టేషన్ రికార్డులైన పార్ట్ 1 - 5 పెండింగ్ లేకుండా చూడాలని, సిబ్బందికి వర్టికల్ వారీగా విధులను కేటాయించాలని ఎస్.హెచ్.ఓ కు సూచించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణకు, సైబర్ నేరాల నివారణకు వివిధ స్కూల్స్ కళాశాలలు, పని ప్రదేశాలలో కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతి రోజు వాహనాల తనిఖీ నిర్వహిస్తూ, ట్రాఫిక్ నియమాలు పాటించని వాహణదారులపై చర్యలు తీసుకోవాలని, అనుమానిత వాహనాలను అదుపులోకి తీసుకోవాలని అన్నారు.బ్లూ కోల్ట్స్ సిబ్బంది ప్రతి పాయింట్ ను తనిఖీ చేయాలని, డైల్ 100 కాల్స్ కు త్వరితగతిన స్పందించాలని సూచించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్ 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్,టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణ, సీడీఆర్, సిఇఐఆర్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, బాడీ ఓన్ కెమెరాల వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు నేరాల అదుపునకు, జరిగిన నేరాలను ఛేదించడానికి ఉపయోగకరంగా ఉన్నాయని, అన్ని అప్లికేషన్లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహించాలని సిబ్బందికి సూచించడం జరిగింది, ఇప్పుడు నేర్చుకున్న పని మీ సర్వీస్ మొత్తం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. విధి నిర్వాహణలో అంకిత భావంతో పని చేయాలని. ఎవరికీ కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వర్తించినప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యకిగతంగా ఎలాంటి సమస్య ఉన్న నేరుగా నా దృష్టికి తీసుకురావొచ్చు అన్నారు. పోలీస్ స్టేషన్, రికార్డుల మెయింటనెన్స్ బాగుందని, అధికారులు, సిబ్బందిని ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం పుల్కల్ మండల పరిదిలో NH-161 రోడ్డు పై అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న (బ్లాక్ స్పార్ట్) ను ఎస్పీ ప్రత్యేకంగా సందర్శించి, వాహనాల వేగం అదుపునకు ర్యాంబుల్ స్ట్రిప్స్, ఇసుక డ్రమ్ములు ఏర్పాటు చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు.. ఈ తనిఖీ లలో ఎస్పీ వెంబడి సంగారెడ్డి డియస్పి సత్యయ్య గౌడ్, జోగిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్, ఎస్ఐ విశ్వజన్ లు ఉన్నారు.



---

## కొర్ర వెంకట్రాం కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ పిఎసిఎస్ చైర్మన్ మారం రాము

**నెక్కొండ సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):**

వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణానికి చెందిన కోర్ర వెంకటరామ్ వారి పెద్దకర్మ కార్యక్ర మంలో పాల్గొని వారి చిత్రపటానికి నివాళులర్పించి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్న. నెక్కొండ మాజీ పిఎసిఎస్ చైర్మన్ మారం రాము, మరియు అడ్వకేట్ కొమ్ము రమేష్ యాదవ్, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, రావుల భాస్కర్ రెడ్డి, దుగ్గి వెంకట్ రెడ్డి, ఈదునూరి వెంకన్న, గద్దం రమేష్, ముడిదేని కమలాకర్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఒకే బెడ్డుపై ముగ్గురు, నలుగురు!

**ములుగు సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. విష జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో పిల్లల వార్డులో ఒకే బెడ్డుపై ముగ్గురు, నలుగురు పేషంట్లను పడుకో బెట్టి వైద్యం నిర్వహిస్తున్నారు. చాలీచాలని బెడ్లతో అవస్థలు పడుతున్నామని రోగుల తల్లిదండ్రులు వాపోతున్నారు. 10 మండలాలకు పెద్దదిక్కుగా ఉన్న జిల్లా ఆసుపత్రిలో పరిస్థితి ఈ విధంగా ఉండటంపై జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# యూఏఈపై పాక్ ఘన విజయం

**• గ్రూపు-ఏ నుంచి సూపర్-4కి చేరిన రెండో జట్టు**



ఆసియా కప్ సూపర్-4లోకి పాకిస్తాన్ దూసుకెళ్లింది. బుధవారం ఆతిథ్య యూఏఈతో జరిగిన మ్యాచ్ లో 41 పరుగులతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ ను బాయ్ కాట్ చేస్తామంటూ పలు హెచ్చరికల మధ్య కాస్త లేట్ గా ఈ మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పాక్.. షరమాములుగానే బ్యాటింగ్ వైఫల్యం కనిపించింది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 146 పరుగులు చేసింది. వన్ డౌన్ బ్యాటర్ ఫఖార్ జమాన్ సూపర్బ్ ఫిఫ్టీ (36 బంతుల్లో 50, 2 ఫోర్లు, 3 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో జునైద్ సిద్దిఖీ నాలుగు వికెట్లతో పాక్ బ్యాటింగ్ ను వణికించాడు. అనంతరం ఛేజింగ్ లో 17.4 ఓవర్లలోనే 105 పరుగులకు యూఏఈ ఆలౌటైంది. వికెట్ కీపర్ బ్యాటర్ రాహుల్ చోప్రా (35) టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో షాషిన్ షా అఫ్రిదీ, హరీస్ రౌఫ్, అబ్రార్ అహ్మద్ లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఈ విజయంతో గ్రూపులో రెండేసి విజయాలతో భారత్ తోపాటు పాక్ కూడా సూపర్-4కు చేరుకుంది. ఒమన్ ఇప్పటికే నాకౌట్ అవగా, తాజాగా యూఏఈ కూడా ఇంటిముఖం పట్టింది. దీంతో గ్రూప్-ఏ నుంచి సూపర్-4కి చేరే జట్లు ఖరరవగా, గురువారం ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక జట్ల మధ్య జరిగే మ్యాచ్ తో గ్రూప్-బిలో సూపర్-4కు చేరే జట్లపై స్పష్టత వస్తుంది. బౌలింగ్ కు అనుకూలమైన పిచ్ పై టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ కు దిగిన పాక్ కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగలింది. టోర్నీలో వరుసగా మూడో మ్యాచ్ లోనూ ఓపెనర్ సయూమ్ అయూబ్ డకౌటయ్యాడు. మరో ఓపెనర్ షాహిబ్ జాదా ఫర్హాన్ (5) కూడా తర్వగా పెవిలియన్ కు చేరాడు. ఈ దశలో ఫఖార్, కెప్టెన్ సల్మాన్ ఆఘా (20) తో కలిసి ఇన్నింగ్స్ ను నిర్మించాడు. దూకుడుగా ఆడిన జమాన్.. 35 బంతుల్లోనే ఫిఫ్టీ చేశాడు. అయితే వీరిద్దరూ ఔటయ్యాక పాక్ ఇన్నింగ్స్ గతి తప్పింది. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి, కష్టాల్లో పడింది. చివర్లో మమ్మద్ హరీస్ (18), షాహిన్ అఫ్రిది (29 నాటౌట్) బ్యాట్ ఝుళిపించడంతో పాక్ సవాలు విసరగలిగే స్కోరును సాధించింది. మిగతా బౌలర్లలో సమర్జిత్ సింగ్ మూడు వికెట్లు తీశాడు. పాక్ పై ఇప్పటికే రెండు విజయాలు సాధించిన ఉత్సాహంలో ఉన్న యూఏఈ.. ఛేజింగ్ ను ఆత్మ విశ్వాసంతో ప్రారంభించింది. ఓపెనర్లు అలీషన్ షర్ఫు (12), కెప్టెన్ మహ్మద్ వసీమ్ (14) మంచి ఆరంభాన్నే ఇచ్చారు. వీరిద్దరూ ఔటయ్యాక, చోప్రాతోపాటు ధ్రువ్ పరాశర్ (20) కాస్త పోరాడారు. అయితే కీలక సమయాల్లో పాక్ బౌలర్లు వికెట్లు తీయడంతో టార్గెట్ కు చాలా దూరంలోనే యూఏఈ ఆగిపోయింది. దీంతో టోర్నీలో రెండో విజయంతో తర్వాత దశకు పాక్ అర్హత సాధించింది.

# ఐసీసీ నెం.1 బౌలర్‌గా నిలిచిన వరుణ్ చక్రవర్తి



భారత ఏస్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ప్రస్తానం ఆసక్తికరంగా సాగింది. నాలుగేళ్ల కిందట యూఏఈలో జరిగిన టీ20 ప్రపంచకప్ 2021 మ్యాచ్ లో పాకిస్థాన్ చేతిలో ఘోర ప్రదర్శన చేసి జట్టు నుంచి ఉద్వాసనకు గురైన వరుణ్.. ఆ తర్వాత మూడేళ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్ కు ఆడలేకపోయాడు. అయితే గత ఏడాది నవంబర్ నుంచి అంతర్జాతీయ టీ20ల్లోకి రీ ఎంట్రీ ఇచ్చి సత్తా చాటుతున్నాడు. కేవలం పది నెలల్లోనే ఈ ఫార్మాట్లో నెం.1 స్తానాన్ని దక్కించుకున్నాడు. తాజా ఐసీసీ టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్ లో తను నెంబర్ వన్ పొజిషన్ కు చేరుకున్నాడు. దీంతో ఈ ఘనత సాధించి మూడో భారత బౌలర్ గా రికార్డులకెక్కాడు. గతంలో స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా, లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ మాత్రమే ఈ శిఖర స్తానాన్ని చేరుకుని, చరిత్ర సృష్టించారు. తాజాగా ఆ జాబితాలోకి వరుణ్ చేరుకోవడం పట్ల భారత అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు.నిజానికి 2021 ప్రపంచకప్ లో తొలిసారి పాక్ చేతిలో ఇండియా ఓడిపోయింది. ఆ మ్యాచ్ లో ఏకంగా పది వికెట్ల తేడాతో ఇండియా పరాజయం పాలై, ఆ తర్వాత ఏకంగా టోర్నీ నుంచే లీగ్ దశలో నిష్క్రమించింది. ఇక ఈ మ్యాచ్ లో బౌలింగ్ చేసిన వరుణ్ పై చాలా విమర్శలు వచ్చాయి. మిస్టరీ స్పిన్నర్ గా బరిలోకి దిగిన వరుణ్ ను పాక్ ప్లేయర్లు అలవోకగా ఎదుర్కొన్నారు. దీంతో తన కంటే తమ గల్లీ బౌలర్లు బాగా బౌలింగ్ చేస్తారని, తను మిస్టరీ స్పిన్నర్ అనడం జోక్ గా ఉందని పలువురు పాక్ మాజీ లు వేళాకోళం చేశారు. అయితే అప్పటి అవమానం నుంచి బౌన్స్ బ్యాక్ అయిన వరుణ్.. సైలెంట్ గా సత్తా చాటాడు. గతేడాది నవంబర్ లో సౌతాఫ్రికాతో జరిగిన సిరీస్ లో వరుణ్ ఆకట్టుకున్నాడు. అద్భుతమైన ఆటతీరుతో ఆ సిరీస్ లో మెరిశాడు. ఆ తర్వాత ఇంగ్లాండ్ తో జరిగిన టీ20ల్లోనూ సత్తా చాటాడు. ఫైవ్ వికెట్ హాల్ ప్రదర్శన తోనూ తన సత్తా చాటాడు. ఆ తర్వాత ఏకంగా వన్డే జట్టులోకి వచ్చి, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ సాధించిన భారత జట్టులో సభ్యునిగా కీలకంగా మారాడు. ఈ క్రమంలో టీ20, వన్డే జట్టులో తన స్తానాన్ని పదిలం చేసుకున్నాడు. తాజాగా యూఏఈలోనే జరుగుతున్న ఆసియా కప్ లో తొలి రెండు మ్యాచ్ ల్లో రెండు వికెట్లు తీసి, నెం.1 బౌలర్ హోదాను దక్కించుకున్నాడు. నాడు యూఏఈలో హ్యుమిలేషన్ కు గురైన వరుణ్.. తాజాగా అదే గడ్డపై అటు చాంపియన్స్ ట్రోఫీ, ఇటు నెం.1 బౌలర్ కిరీటాలను ధరించాడు. రాబోయే రోజుల్లో టీమిండియా ఆడే మూడు ఫార్మాట్లలోనూ తను సభ్యునిగా కావాలని భారత అభిమానులు కోరుకుంటున్నారు.

# ఐపీఎల్ జట్లు కూడా పాకిస్థాన్‌ను ఓడించగలవు

**మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ సంచలన వ్యాఖ్యలు**

ఆసియా కప్ 2025లో భాగంగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టీమిండియా సాధించిన అద్భుతమైన విజయం అనంతరం పాక్ జట్టుపై విమర్శల పరంపర కొనసాగుతోంది. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ సంచలన వ్యాఖ్యలు చేస్తూ పాకిస్థాన్ జట్టును తీవ్రంగా ఏకిపారేశారు. ఈ వ్యాఖ్యలు తరచూ భారత జట్టుపై విమర్శలు చేసే షాహిద్ అఫ్రిదికి గట్టి సమాధానం ఇచ్చినట్లుగా తెలుస్తోంది.ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఇర్ఫాన్ పఠాన్ పాకిస్థాన్ జట్టు బలహీనతను ఎత్తి చూపారు. భారతదేశంలో ఉన్న చాలా డొమెస్టిక్ జట్లు.. ఉదాహరణకు ముంబై, పంజాబ్ వంటి జట్లు కూడా పాకిస్థాన్ జట్టును ఓడించగలవని ఆయన అన్నారు. అంతే కాకుండా చాలా ఐపీఎల్ జట్లు కూడా పాకిస్థాన్ ను ఈజీగా ఓడించగలవని పేర్కొన్నారు. ఈ కామెంట్స్‌తో పాకిస్థాన్ జట్టు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడడానికి ఇంకా చాలా మెరుగుపడాల్సిన అవసంరం ఉందని ఇర్ఫాన్ పఠాన్ సూచించారు.దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత బౌలర్లు అద్భుతంగా రాణించి పాకిస్థాన్ జట్టును కేవలం 127 పరుగులకే కట్టడి చేశారు. పాకిస్థాన్ బ్యాటింగ్ లైనప్‌లో షాహీన్ అఫ్రిది మినహా ఎవరూ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. అనంతరం భారత బ్యాటర్లు లక్ష్యాన్ని కేవలం 15.5 ఓవర్లలోనే ఛేదించి విజయఢంకా మోగించారు. అభిషేక్ శర్మ తొలి రెండు బంతుల్లోనే 10 పరుగులు చేసి మ్యాచ్ పై తమ పట్టును చూపించారు. ఈ గెలుపు భారత్ ఆత్మవిశ్వాసాన్ని పెంచగా.. పాకిస్థాన్ జట్టు తమ ఆటతీరుపై ఆలోచించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది.



# గ్రూప్-బీలో సూపర్-4కు చేరేదెవరో..?




ఆసియా కప్ 2025లో లీగ్ దశ ముగింపుకు చేరుకోవడంతో గ్రూప్-బీలోని మూడు జట్ల మధ్య సూపర్-4 క్వాలిఫికేషన్ కోసం తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే గ్రూప్-ఏ నుంచి భారత్, పాకిస్థాన్ ఇప్పటికే తమ స్థానాలను పదిలం చేసుకున్నాయి. గ్రూప్-బీలో మాత్రం సూపర్-4 క్వాలిఫికేషన్ జట్ల గురించి ఇంకా స్పష్టత రాలేదు. బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య జరుగుతున్న ఈ రేసులో ప్రతి బంతి, ప్రతి పరుగు ఎంతో కీలకమైనది. నేడు శ్రీలంక, అఫ్గానిస్తాన్ మధ్య జరుగునున్న మ్యాచ్‌తో గ్రూప్-బీలో అర్హత సాధించే జట్ల భవితవ్యం నిర్ణయం కానుంది. గ్రూప్-బీలో మూడు జట్లలో ఒక్కొక్కరికి వారి అర్హత అవకాశాలు వేర్వేరుగా ఉన్నాయి. బంగ్లాదేశ్ తమ అన్ని లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసింది. ఇప్పుడు వారి భవితవ్యం శ్రీలంక, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య నేడు జరగబోయే మ్యాచ్ ఫలితంపై ఆధారపడి ఉంది. బంగ్లాదేశ్ తన లీగ్ మ్యాచ్‌లన్నీ పూర్తి చేసుకుని తమ భవితవ్యం కోసం ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడుతోంది. శ్రీలంక గనుక అఫ్గానిస్తాన్‌ను ఓడిస్తే బంగ్లాదేశ్ సూపర్-4లోకి వెళ్తుంది. కానీ అఫ్గానిస్తాన్ గెలిస్తే బంగ్లాదేశ్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. అందుకే బంగ్లాదేశ్ అభిమానులు శ్రీలంక విజయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అఫ్గానిస్తాన్ గనుక శ్రీలంకను 70 లేదా అంతకంటే ఎక్కువ పరుగుల తేడాతో ఓడిస్తే, బంగ్లాదేశ్ నెట్ రన్ రేట్ శ్రీలంక కంటే మెరుగ్గా ఉంటుంది. ఈ పరిస్థితిలో బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ రెండూ క్వాలిఫై అవుతాయి.అఫ్గానిస్తాన్ క్వాలిఫికేషన్ సమీకరణం చాలా సులభంగా ఉంది. కానీ వారికి ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. అఫ్గానిస్తాన్ శ్రీలంకను ఏ తేడాతో ఓడించినా, వారి నెట్ రన్ రేట్ బంగ్లాదేశ్ కంటే మెరుగ్గా ఉన్నందున శ్రీలంకతో కలిసి సూపర్-4లో అడుగుపెడుతుంది 70 లేదా అంతకంటే ఎక్కువ పరుగుల తేడాతో గెలిచినా, లేదా లక్ష్యాన్ని 50 లేదా అంతకంటే ఎక్కువ బంతులు మిగిలి ఉండగానే ఛేదించినా, అఫ్గానిస్తాన్ బంగ్లాదేశ్‌తో కలిసి అర్హత సాధిస్తుంది.ఈ టోర్నీలో శ్రీలంక ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. వారి క్వాలిఫికేషన్ అవకాశాలు మెరుగ్గా ఉన్నప్పటికీ, వారు జాగ్రత్తగా ఉండాలి. శ్రీలంక అఫ్గానిస్తాన్‌ను ఏ తేడాతో ఓడించినా, వారు గ్రూప్ టాపర్‌గా నిలిచి బంగ్లాదేశ్‌తో కలిసి సూపర్-4కు వెళ్తారు. ఒకవేళ శ్రీలంక ఓడిపోయినా, ఓటమి తేడా 70 పరుగుల కంటే తక్కువగా ఉండాలి. అలా జరిగితే, బంగ్లాదేశ్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది, శ్రీలంక, అఫ్గానిస్తాన్ క్వాలిఫై అవుతాయి.అఫ్గానిస్తాన్ లక్ష్యాన్ని ఛేదిస్తున్నప్పుడు, శ్రీలంక వారు 12.2 ఓవర్లలోపు (అంటే 46 బంతులు మిగిలి ఉండగానే) లక్ష్యాన్ని పూర్తి చేయకుండా జాగ్రత్త పడాలి. అలా జరిగితే శ్రీలంక నెట్ రన్ రేట్ దెబ్బతిని క్వాలిఫికేషన్ కష్టం అవుతుంది.

# భారత్‌కు మా క్రికెట్‌ను కూల్చే శక్తి ఉంది

**పీసీబీ మాజీ ఛైర్మన్ రమీజ్ రాజా**

ఆసియా కప్ 2025లో భాగంగా పాకిస్థాన్, భారత్ మధ్య జరిగిన మ్యాచ్ తర్వాత షేక్ హ్యాండ్ ఇవ్వకపోవడంపై జరిగిన వివాదం అనంతరం మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను తొలగించాలని పీసీబీ చేసిన డిమాండ్ పాక్ క్రికెట్లో పెద్ద దుమారాన్నే రేపుతోంది. ఈ వివాదంపై పీసీబీ మాజీ ఛైర్మన్ రమీజ్ రాజా కూడా స్పందించి బీసీసీఐపై ఆరోపణలు చేశారు. అయితే ఆయనే గతంలో భారత్ గురించి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(%ూజదీ%) ఛైర్మన్ గా ఉన్న సమయంలో రమీజ్ రాజా భారత్‌ను ప్రశంసించారు. 2021లో రమీజ్ రాజా మాట్లాడుతూ.. "ఐసీసీ ఒక రాజకీయ సంస్థ. ఐసీసీ ఆదాయంలో 90 శాతం భారత్ నుంచే వస్తుంది. పీసీబీకి వచ్చే నిధుల్లో 50 శాతం ఐసీసీ నుంచే వస్తుంది. భారత్‌లోని వ్యాపార సంస్థలే పాకిస్థాన్ క్రికెట్‌ను నడుపుతున్నాయి. రేపు భారత ప్రధాని ఒక నిర్ణయం తీసుకుని పాకిస్థాన్‌కు ఎటువంటి నిధులు ఇవ్వకుండా ఆపేస్తే, ఈ క్రికెట్ బోర్డు కుప్పకూలిపోతుంది" అని రమీజ్ రాజా చెప్పారు అయితే ఇప్పుడు అదే రమీజ్ రాజా బీసీసీఐని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారు. భారత్-పాక్ మ్యాచ్ అనంతరం జరిగిన వివాదానికి పైక్రాఫ్ట్ కారణమని ఆరోపించారు. మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను తొలగించాలనే పీసీబీ డిమాండ్ ను ఐసీసీ పట్టించుకోలేదు. ఈ క్రమంలో పాకిస్థాన్ జట్టు యూఏ ఈతో మ్యాచ్ ఆడి, కష్టపడి గెలిచి సూపర్-4కు చేరింది. ఈ విజయంతో సెప్టెంబర్ 21 దుబాయ్‌లో మళ్లీ భారత్‌తో తలపడ నుంది. ఓ వైపు మ్యాచ్‌లకు ముందు వివాదాలు.. మరోవైపు పాక్ జట్టు ఆటతీరుపై ప్రశ్నలు ఉన్నప్పటికీ.. ఈ మొత్తం డ్రామా చివరకు ఇరు జట్ల మధ్య మరో రసవత్తరమైన పోరుకు దారి తీసింది.



# ఫామ్ కోల్పోయి ఇబ్బందులు పడుతున్న శ్రేయాస్ అయ్యర్

టీమిండియాలో తిరిగి స్థానం సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తున్న బ్యాట్స్‌మెన్ శ్రేయాస్ అయ్యర్ ఫామ్ కోల్పోయి కష్టాలు పడుతున్నాడు. లక్నోలో ఆస్ట్రేలియా-ఎతో జరిగిన మొదటి అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో ఇండియా-ఎ కెప్టెన్ అయిన శ్రేయాస్ అయ్యర్ మళ్లీ జట్టును నిరాశపరిచాడు. ఆస్ట్రేలియా స్పిన్నర్ కోరీ రోచిచియోలీ బౌలింగ్‌లో కేవలం 13 బంతుల్లోనే 8 పరుగులు చేసి అవుటయ్యాడు. ఈ మ్యాచ్‌కు ముందు కూడా దులీప్ ట్రోఫీలో అతను పెద్దగా రాణించలేకపోయాడు.శ్రేయాస్ అయ్యర్ గత మూడు ఇన్నింగ్స్‌లలో పెద్దగా స్కోర్ చేయలేకపోయాడు. దులీప్ ట్రోఫీ 2025లో సెంట్రల్ జోన్‌పై వెస్ట్ జోన్ తరపున ఆడుతూ, మొదటి ఇన్నింగ్స్‌లో 25 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 12 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. ఈ నిరాశాజనకమైన ఫామ్ ఆస్ట్రేలియా-ఎతో మ్యాచ్‌లోనూ కొనసాగింది. ఇది అతని టీమిండియాలో స్థానంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అయ్యర్ విఫలమైనప్పటికీ.. ఇండియా-ఎ జట్టులోని నలుగురు బ్యాట్స్‌మెన్లు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. వారు హాఫ్ సెంచరీ సాధించి జట్టుకు బలమైన పునాది వేశారు. వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ నారాయణ్ జగదీషన్ 113 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్సర్‌తో 64 పరుగులు చేశాడు. ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ 44 పరుగులు చేసి, జట్టుకు మంచి ఆరంభం ఇచ్చాడు. సాయి సుదర్శన్ 124 బంతుల్లో 10 ఫోర్ల సహాయంతో 73 పరుగులు సాధించాడు. దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురేల్ కూడా హాఫ్ సెంచరీలు పూర్తి చేసి క్రీజులో నిలిచారు. ఈ అద్భుతమైన ప్రదర్శనతో ఇండియా-ఎ జట్టు స్కోర్ 400 పరుగుల దగ్గరకు చేరుకుంది. మ్యాచ్ జరిగే సమయానికి, భారత్ 4 వికెట్ల నష్టానికి 383 పరుగులు చేసింది. ఈ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా-ఎ బ్యాట్స్‌మెన్లు ఆధిపత్యం కనబరిచారు. వారు 6 వికెట్ల నష్టానికి 532 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ చేశారు. వారి జట్టులోని ఇద్దరు బ్యాట్స్‌మెన్లు సెంచరీలు సాధించారు. అయినప్పటికీ, ఇండియా-ఎ బ్యాట్స్‌మెన్లు కూడా ధీటుగా బదులిచ్చారు.. కానీ శ్రేయాస్ అయ్యర్ ఫామ్ మాత్రం భారత జట్టుకు ఆందోళన కలిగించే విషయం.




# ఎఎన్నార్ 101 జయంతి స్పెషల్

## ప్రేమాభిషేకం రీ-రిలీజ్ -థియేటర్లలో ఉచితంగా ప్రదర్శన

దివంగత అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతి సందర్భంగా అభిమానులకు ప్రత్యేక బహుమతి సిద్ధమైంది. ఆయన నటించిన సూపర్‌హిట్ క్లాసిక్ చిత్రాలు డాక్టర్ చక్రవర్తి, ప్రేమాభిషేకం మళ్లీ పెద్ద తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా, ఈ సినిమాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఎంపిక చేసిన థియేటర్లలో అది కూడా ఉచిత టిక్కెట్లతో ప్రదర్శించనున్నారు. ఇది నిజంగా అభిమానుల్లో విశేష ఆనందాన్ని కలిగిస్తోంది.ఈ రెండు ప్రసిద్ధ చిత్రాలు సెప్టెంబర్ 20 నుంచి మళ్లీ రీ-రిలీజ్ అవుతున్నాయి. పెద్ద తెరపై ఏఎన్ఆర్ మాయాజాలాన్ని మళ్లీ ఆస్వాదించే అరుదైన అవకాశం ఇది. ఈ ప్రత్యేక ప్రదర్శనలకు టిక్కెట్లు- బుక్ మై షో లో ఉచిత రిజర్వేషన్ కోసం అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ఒంగోలు వంటి ప్రధాన నగరాల్లోని ప్రముఖ థియేటర్లలో ప్రదర్శనలు జరగనున్నాయి. వీటిలో వైజాగ్‌లో క్రాంతి థియేటర్, ఒంగోలులో స్వర్ణ ప్యాలెస్, విజయవాడలో కృష్ణ టాకీస్, అలాగే హైదరాబాద్‌లోని ఒక ప్రసిద్ధ థియేటర్ కూడా ఉన్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని కేంద్రాలను జోడించే అవకాశం ఉందని సమాచారం. ఏఎన్ఆర్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఆయన నటన, సిల్వర్ స్క్రీన్‌పై సృష్టించిన మాయాజాలాన్ని అభిమానులు మరోసారి ఆస్వాదించనున్నారు. అభిమానులు తమ తమ నగరాల్లోని థియేటర్లకు వెళ్లి, కుటుంబసభ్యులతో కలిసి ఈ క్లాసిక్ సినిమాలను చూసి ఆనందించాలని పిలుపునిచ్చారు.

# ఓజి నుంచి ప్రకాశ్ రాజ్ పోస్టర్ విడుదల

పవన్ కల్యాణ్ హీరోగా 'ఓజీ' సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మేకర్స్ ఓ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఇందులో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ పాత్రను పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. చిత్రంలో ఆయన 'సత్య దాదా' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రకాశ్ రాజ్ సీరియస్ లుక్‌లో కనిపించారు. పోస్టర్ ఆధారంగా ఆయన పాత్ర కీలకమని అర్థమవుతోంది. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా 'ఓజీ' రూపొందుతోంది. ఇందులో పవన్ ఇప్పటి వరకూ ఎన్నడూ చూడని పాత్రలో ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ఆయన సరసన ప్రియాంకా మోహన్ నటించారు. ఇమ్రాన్ హష్మీ విలన్. శ్రియారెడ్డి, అర్జున్‌దాస్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం దీని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.




# హాట్ అందాలతో మెస్మరైజ్ చేస్తున్న రెజీనా..



రెజీనా కసాండ్రా.. తమిళనాడు హీరోయిన్ అయినప్పటికీ తెలుగు సినిమాల్లో ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకుంది.. తమిళనాడు చెన్నైలో పుట్టి పెరిగిన ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్లోకి శివ మనసులో శృతి అనే సినిమాతో ఎంట్రీ ఇచ్చింది.ఆ తర్వాత రొటీన్ లవ్ స్టోరీ, కొత్తజంట, పిల్లా నువ్వు లేని జీవితం, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ వంటి ఎన్నో హిట్ సినిమాల్లో మెరిసింది. అలా ఈ హీరోయిన్ తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో నటిగా రాణించింది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసిన ఫోటోల ద్వారా హాట్ టాపిక్ గా మారింది. ఆ ఫోటోలు చూసినా చాలామంది నెటిజన్లు "హాట్ గా ఉన్నావు.. చెమటలు పట్టిస్తున్నావు" అంటూ కామెంట్లు పెడుతున్నారు. తాజాగా రెజీనా తన ఇంస్టాగ్రామ్ ఖాతాలో బ్లాక్ కలర్ పార్టీవేర్ డ్రెస్ లో ఉన్న ఫోటోలను షేర్ చేసుకుంది. ఆ ఫోటోలలో రెజీనా కసాండ్రా అచ్చం ప్రిన్సెస్ లాగే మెరిసిపోతుంది. ప్రిన్సెస్ వేసుకునే డ్రెస్ తో పాటు ఆమె హెయిర్ స్టైల్ కూడా అచ్చం ప్రిన్సెస్ మాదిరి లాగే ఉండడంతో అచ్చం దేవకన్యలా, రాజకుమారిలా ఉన్నావు అంటూ చాలామంది నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఈ బ్లాక్ కలర్ డ్రెస్ కి వైట్ కలర్ పూసల చైన్ ని కాంబినేషన్ గా మెడలో ధరించింది రెజీనా.. అలాగే చేతికి కూడా పూసల బ్రేస్లెట్ ని పెట్టుకోవడంతో మరింత లుక్ వచ్చింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారడంతో చాలామంది నెటిజన్స్ హాట్ హాట్ గా కామెంట్లు పెట్టడంతో పాటు హాట్ ఎమోజీలను షేర్ చేస్తున్నారు. ఈ బ్లాక్ డ్రెస్ ఫోటోల కింద రెజీనా "హలో అపరిచితుడు.. మిస్ కసాండ్రా..మీకు వీలైతే" అంటూ క్యాప్షన్ పెట్టింది. ఇక రెజీనా కసాండ్రా సినిమాల విషయానికి వస్తే.. తమిళంలో మూకుత్తి అమ్మన్ -2,కల్లా పార్ట్, అనంతన్ కాదు, పార్టీ,ఫ్లాష్ బ్యాక్, సూర్పనగై వంటి సినిమాల్లో చేస్తోంది. అలాగే తెలుగులో కైవల్య అనే సినిమాలో నటిస్తోంది. ఇకపోతే ఇండస్ట్రీకి వచ్చి రెండు దశాబ్దాలు అవుతున్నా.. ఇప్పటికీ తగ్గని క్రేజ్ తో వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఒకవైపు హీరోయిన్ గా సినిమాలు చేస్తూనే మరొకవైపు క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలతో కూడా ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె ఢీ వంటి డాన్స్ షోలకు జడ్జిగా కూడా వ్యవహరిస్తూ అభిమానులకు చేరువ అవుతోంది. మొత్తానికి అయితే వరుస పెట్టి సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న రెజీనా ఇటు సోషల్ మీడియాలో కూడా అందాలు ఒలకబోస్తూ మరింత హాట్ టాపిక్ గా మారిందని చెప్పవచ్చు.

# సెప్టెంబర్ సినిమాలకు కలసి వచ్చింది

## కిష్కింధపురి సక్సెస్ మీట్‌లో అనిల్ రావిపూడి



ఈ సెప్టెంబర్‌లో థియేటర్‌లు కళకళలాడుతున్నాయని అనిల్ రావిపూడి పేర్కొన్నారు. ఇది సక్సెస్‌ఫుల్ సెప్టెంబర్ అన్నారు. వరుస సినిమాలతో పండగ వాతావరణం నెలకొందని.. ఇదే కొనసాగాలని కోరుకుంటున్నానని అన్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కిష్కింధపురి' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. తాజాగా ఆడియన్స్‌కు ధన్యవాదాలు చెబుతూ టీమ్ హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ ఈవెంట్‌కు దర్శకుడు అనిల్ రావిపూడి, బాబీ, అనుదీప్, వశిష్ఠలతో పాటు- హీరో సాయి దుర్గా తేజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హారర్ సినిమాలు ఎలా ఉన్నా అందరూ ఆదరణ సొంతం చేసుకుంటాయని అందరూ అనుకుంటారు. కానీ, వాటిలో కంటెంట్ ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వాళ్ల నాన్న ఎంత పెద్ద నిర్మాతో అందరికీ తెలిసిందే. అయినా సాయి మాత్రం ఏ సినీ నేపథ్యం లేనట్లు- కష్టపడుతుంటాడు. అనిల్ రావిపూడి- చిరంజీవి కాంబినేషన్‌లో రానున్న సినిమాలో కొన్ని సన్నివేశాలు చూశాను. చాలా బాగున్నాయి. కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుంది. ఈ సినిమాతో విజయాన్ని సొంతం చేసుకున్న నిర్మాత సాహు గారపాటి.. సంక్రాంతికి చిరంజీవి చిత్రంతో మరోసారి మంచి ఫలితాలు చూస్తారని బాబీ నమ్మకంగా చెప్పారు.తెలుగు సినిమాలకు థియేటర్‌లలో జనాలు రావడం లేదని ఈ మధ్య కామెంట్స్ వినిపించాయి. కానీ, సెప్టెంబర్‌ను మాత్రం ఆడియన్స్ సెలబ్రేట్ చేసుకున్నారు. సాయి దుర్గాతేజ్ అంటే నాకు చాలా ఇష్టం. ఒక బ్రదర్‌గా ఆయన ఎప్పుడూ నాకు తోడున్నారని సాయి శ్రీనివాస్ తెలిపారు.



# కిస్ మూవీ ట్రైలర్ విడుదల

తమిళ నటుడు కవిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'కిస్'. 'దాదా' సినిమాతో మంచి హిట్ అందుకున్న కవిన్.. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రముఖ కొరియోగ్రాఫర్ సతీష్ కృష్ణన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతుండగా.. రోమియో పిక్చర్స్ బ్యానర్‌పై రాహుల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా, సినిమా నుంచి తాజాగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో కవిన్.. ప్రేమ, ముద్దు అంటే అస్సలు ఇష్టపడని యువకుడి పాత్రలో కనిపిస్తున్నారు.

గతంలో జరిగిన సంఘటనల కారణంగా ప్రేమపై నెగిటివ్ భావాలు ఏర్పడిన అతడి జీవితంలోకి 'ప్రీతి' అనే అమ్మాయి ప్రవేశించిన తర్వాత ఎలాంటి మార్పులు జరిగాయి? అన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశం.ఈ చిత్రం తెలుగు, తమిళంతో పాటు- హిందీ భాషల్లో కూడా విడుదల కానుంది.


# కుటుంబ గొడవలతో మౌనంగా ఉన్నా

## దక్ష ప్రమోషన్‌లో వెల్లడించిన మంచు లక్ష్మి



ఇంట్లో ఎవరు హిట్ అందుకున్నా.. అది అందరి విజయంగా భావించి ఆనందిస్తానని నటి మంచు లక్ష్మి అన్నారు. తన తండ్రి మోహన్‌బాబుతో కలిసి ఆమె నటించిన యాక్షన్ చిత్రం 'దక్ష' 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రచారంలో ఆమె బిజీగా ఉన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమ కుటుంబంలో జరిగిన గొడవలపై మాట్లాడారు. మిరాయ్' విజయాన్ని నేను కూడా ఎంజాయ్ చేస్తున్నాను. కుటుంబంలో ఎవరికి సక్సెస్ వచ్చినా మా అందరిదిగా భావించి ఆనందిస్తా. ఒకరి కష్టం వృథా కావాలని ఎప్పుడూ కోరుకోను. జీవిత పాఠాలు నేర్చుకోవాలి అనుకుంటాను.. కానీ, కష్టానికి ప్రతిఫలం రాకుండా ఉండాలని ఎప్పుడూ కోరుకోను. ఎందుకంటే ఈ రంగంలో ఎన్ని ఇబ్బందులు ఉంటాయో నాకు తెలుసు. ఒక ఆర్టిస్ట్‌గా వాళ్లకు సలహాలు ఇస్తాను. 'మిరాయ్' సక్సెస్‌ను ఎంజాయ్ చేయమని మొన్న కలిసినప్పుడు కూడా మనోజ్‌కు చెప్పానని అన్నారు. ఒక కుటుంబంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు అందరూ నలిగిపోతారు. అలా జరగదు అని చెప్పడం అబద్ధం. కానీ, మేము ఉండేది అద్దాల మేడలో.. ఏం చెప్పినా తల, తోక కట్ చేసి వాళ్లకు నచ్చినట్లు- రాసుకునే రోజులివి. అలాంటప్పుడు సైలెంట్‌గా ఉండడమే ఉత్తమం అని నాకు అనిపించింది. అందుకే మౌనంగా ఉన్నాను. గతంలో ఏది ఒప్పు, ఏది తప్పు అని ఆలోచించేదాన్ని. ఇప్పుడు అలా ఆలోచించడం లేదు. దీని వల్ల నేను ఆనందంగా ఉంటానా, బాధపడతానా అని ఆలోచిస్తున్నాను. జీవితంలో ఏదైనా మనకు ఒక పాఠం నేర్పడానికే వస్తుంది. ఏది జరిగినా మౌనంగా ఆలోచిస్తే ప్రశాంతత లభిస్తుందని మంచు లక్ష్మి చెప్పారు.

# కల్కి-2 నుంచి తప్పకున్న దీపిక



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కల్కి 2898 ఏడీ' పార్ట్-2 నుంచి దీపక తప్పుకున్నారు. గతేడాది విడుదలైన ఈ చిత్రం భారతీయ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు- ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ మూవీ టీమ్ సడెన్ షాక్ ఇచ్చింది. దీని సీక్వెల్‌లో దీపికా పదుకొణె నటించడం లేదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. 'కల్కి' సీక్వెల్‌లో దీపిక భాగం కాదని అధికారికంగా తెలియజేస్తున్నాం. తొలి భాగం కోసం ఆమెతో సుదీర్ఘ ప్రయాణం చేసినప్పటికీ రెండో పార్ట్‌లో భాగస్వామి కాలేకపోయింది. గొప్ప టీమ్‌తో కల్కి సీక్వెల్ మీ ముందుకు వస్తుంది. భవిష్యత్తులో దీపిక మంచి సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాం అని వైజయంతీ మూవీస్ పోస్ట్ పెట్టింది. నిర్మాణ సంస్థ ప్రకటనతో అభిమానులు షాక్ అవుతున్నారు. గత కొన్ని రోజులుగా దీపికా పేరు నిత్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్న విషయం తెలిసిందే. ఇటీ-వల ఆమె ఓ భారీ ప్రాజెక్ట్ నుంచి వైదొలగినట్లు- కూడా వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఈ భారీ అప్‌కమింగ్ సినిమా నుంచి ఆమె వైదొలగడం చర్చనీయాంశంగా మారింది.